# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | గురువారం-03- జూలై - 2025 | సంపుటి : 3 | సంచిక : 37 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## బైక్‌పై వెళ్తున్న తండ్రినే దారి కాచి చంపిన కుమారుడు

- సూర్యాపేట జిల్లా మోతె మండలం విభలాపురంలో దారుణం

మానవ సంబంధాలు రోజురోజుకు మంటగలుస్తున్నాయి. ఇటీవల కాలంలో సమాజంలో జరుగుతున్నటువంటి ఘటనలు చూస్తుంటే ఆందోళన కలిగించకమానదు. డబ్బు కోసం కన్నతల్లిదండ్రులను రోడ్డుపైకి ఈడ్చుతున్నావారు కొందరైతే ఆస్తి కోసం ఏకంగా పైకే పంపిస్తున్నవారు మరికొందరు. అలాంటి దారుణ ఘటనే సూర్యాపేట జిల్లాలో జరిగింది. బండిపై వెళ్తున్న తండ్రిని కుమారుడు దారికాచి గొడ్డలితో దాడి చేసి చంపిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. సూర్యాపేట జిల్లా మోతే మండలానికి చెందిన వెంకన్నకు అతడి కుమారుడు గంగయ్యతో కొద్ది రోజులుగా భూవివాదం ఉంది. ఈ క్రమంలోనే వెంకన్న బైక్‌పై స్వగ్రామం వెళ్తుండగా అతడి కుమారుడు దారి కాచి గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. దీంతో తీవ్రగాయాలపాలైన వెంకన్నను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మరణించారు. దీంతో స్థానికంగా విషాదం నెలకొంది.

# విద్య, వైద్యానికే అధిక ప్రాధాన్యం



- హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం
- ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తోంది
- ఒక యూనిక్ ఐడీతో హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఉంటాయి
- ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థపోయి స్పెషలిస్ట్ డాక్టర్స్ రోజులు వచ్చాయి
- కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తాం
- వైద్యులు ఏడాదిలో ఒక నెల రోజులు ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

నగరంలోని బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నగర ప్రజలకు రెండో అతిపెద్ద హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని అభినందించారు. హైదరాబాద్, తెలంగాణకు నాగేశ్వర్ రెడ్డి గొప్ప పేరు తీసుకొచ్చారని.. ఆయన సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ ఇచ్చిందని తెలిపారు. నాగేశ్వర్ రెడ్డి భారతరత్నకు అర్హులన్నారు. ఆయనకు భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. 66 దేశాల నుంచి పేషంట్స్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్సకు వస్తున్నారని ఇది గర్వకారణమన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నామని.. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్‌గా ఉంటుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని.. అందులో భాగంగానే డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారుడిగా నియమించామన్నారు.

మిగతా 2లో..

## అదృష్టం బాగుండి సీఎం అయ్యావు



- ఐదేళ్లు ఉండు.. మంచిగ చేయి
- రాష్ట్ర ద్రోహిగా మిగలకు. నీళ్లలో తెలంగాణకు అన్యాయం చేయకు
- సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సూచిన

2లో..

## కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ



### యూరియా కొరతను అధిగమించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని కోరారు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



రాష్ట్రానికి సరిపడేంత యూరియాను కేటాయించాలని కోరుతూ కేంద్రానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. యూరియా కొరతను అధిగమించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని కేంద్ర కెమికల్ అండ్ ఫర్టిలైజర్స్ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు మంత్రి లేఖలు రాశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రాష్ట్రంలో యూరియా అవసరం అంతకంతకు పెరిగిపోయిందని తెలిపారు.

మిగతా 2లో..



## ప్రమాదంపై స్పందించిన సిగాచీ

- చనిపోయిన కుటుంబాలకు రూ.కోటి పరిహారం
- ప్రమాదానికి రియాక్టర్ పేలుడు కారణం కాదు
- 3 నెలల పాటు కంపెనీని మూసివేస్తున్నట్లు ప్రకటన

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ కంపెనీలో జరిగిన ప్రమాదం అందరినీ కలిచివేస్తోంది. ఈ ఘటనలో 40 మంది మరణించగా.. 33మందికి గాయాలయ్యాయి. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదంపై నిన్నటి వరకు కంపెనీ ఎటువంటి ప్రకటన చేయలేదు.

మిగతా 2లో..

## యాజమాన్యం తప్పుంటే కఠిన చర్యలు తీసుకోవాలి

- ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ



సంగారెడ్డి జిల్లాలోని సిగాచీ ఫార్మా కంపెనీలో పేలుడు సంభవించి పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు మరణించిన ఘటనపై ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. అదొక దురదృష్టకరమైన ఘటన అని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. ఈ ఘటనలో 38 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, ఇది బాధాకరమైన ఘటన అని అన్నారు.

2లో..



## బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి పిలుపు

- ప్రతి ఒక్క బీసీ బిడ్డ పాల్గొనాలి
- రిజర్వేషన్లు అమలు తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి
- బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపాటు

ఖమ్మం, (తెలంగాణ ముచ్చట్లు):

40 శాతం బీసీ రిజర్వేషన్లు ఆమోదం పొందిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

మిగతా 2లో..

## సిగాచీ ఘటనా స్థలాన్ని పరిశీలించిన మంత్రి దామోదర రాజనర్సింహ

### సిగాచీ పరిశ్రమ వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమ వద్ద మూడో రోజు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సోమవారం(జూన్ 30) ఉదయం పరిశ్రమలో భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య ప్రస్తుతం 36కు చేరింది. గాయపడిన 34 మందిని నగర శివార్లలోని వివిధ ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో మొత్తం 143 మంది పనిచేస్తున్నట్లు అక్కడివారు చెబుతున్నారు.

మిగతా 2లో..







## 2026 మేడారం సమ్మక్క జాతర తేదీలు ప్రకటించిన పూజారులు

తెలంగాణ కుంభమేళ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర తేదీలు ఖరారు అయ్యాయి. వచ్చే ఏడాది మేడారంలో జరగబోయే సమ్మక్క, సారలమ్మ మహా జాతర తేదీలను అక్కడి పూజారుల సంఘం ప్రకటించింది. మేడారం పూజారుల సంఘం అధ్యక్షులు సిద్దబోయిన జగ్గారావు ఈ మేరకు తేదీలను వెల్లడించారు. 2026 జనవరి 28వ తేదీన జాతర ప్రారంభం కానుంది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# విద్య, వైద్యానికే అధిక ప్రాధాన్యం



(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్రం చేపట్టే ప్రణాళికలో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కూడా భాగస్వాములు కావాల్సిందిగా ముఖ్యమంత్రి కోరారు. ఆరోగ్య శ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఉందని.. ఇందుకు సరైన విధానంతో ముందుకు వెళుతున్నామని వెల్లడిరచారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు హెల్త్ ప్రొఫైల్ కార్డును క్రియేట్ చేయాలని భావిస్తున్నామన్నారు. ఒక యూనిక్ ఐడీతో ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఉంటాయని తెలిపారు. ఒకప్పుడు ఉన్న ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థపోయి ఇప్పుడు స్పెషలిస్ట్ డాక్టర్స్ రోజులు వచ్చాయన్నారు. హెల్త్ ప్రొఫైల్ క్రియేట్ చేయడం ద్వారా దీన్ని బ్రేక్ చేయొచ్చని సీఎం అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడగలుగుతున్నామని చెప్పడానికే మిస్ వరల్డ్ పార్టిసిపెంట్స్‌కు ఏఐజీ హాస్పిటల్ విజిట్ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. గోశామహల్‌లో నూతన ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించబోతున్నామని.. పనులు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. నిర్మాణంలో ఉన్న వివిధ ఆసుపత్రులు పూర్తైతే మొత్తం 7 వేల పడకలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తామని స్పష్టంచేశారు. వైద్య రంగం అభివృద్ధికి రూ.11500 కోట్లు కేటాయించామని.. రూ.21500 కోట్లు విద్యా రంగం అభివృద్ధికి కేటాయించామని తెలిపారు. పేదలకు ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలనే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాని పేర్కొన్నారు. వైద్యులు ఏడాదిలో ఒక నెల రోజులు సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించాలన్నారు. సాంకేతిక రంగంలో ప్రపంచంలో హైదరాబాద్ కూడా ఒక వేదికగా మారిందని అన్నారు. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి హైదరాబాద్‌కు డైరెక్ట్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని.. కనెక్టివిటీ పెరిగితే హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



# ప్రమాదంపై స్పందించిన సిగాచీ



(మొదటి పేజీ తరువాయి)

దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అటు సీఎం రేవంత్ సైతం కంపెనీ యాజమాన్యంపై ఫైర్ అయ్యారు. 24 గంటల్లోగా స్పందించాలని హెచ్చరించారు. పోలీసులు సైతం కంపెనీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యాజమాన్యంపై 105, 110, 117 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ ముమ్మరం చేశారు. ఎట్టకేలకు ప్రమాదంపై సిగాచీ సంస్థ స్పందించింది. ప్రమాదానికి సంబంధించి ఒక లేక విడుదల చేసింది. అదేవిధంగా స్టాక్ ఎక్స్ ఛేంజ్ సంస్థ బీఎస్ఈకి సైతం సమాచారం ఇచ్చింది. ఈ ఘటనలో 40 మంది చనిపోగా.. 33మంది గాయపడినట్లు తెలిపింది. చనిపోయిన కుటుంబాలకు రూ.కోటి రూపాయల పరిహారం ఇవ్వడంతో పాటు అన్ని రకాల బీమా క్లైమ్‌లను చెల్లిస్తామని చెప్పింది. క్షతగాత్రుల వైద్య ఖర్చులు, కుటుంబ పోషణను తామే చూసుకుంటామని ప్రకటించింది. 35 ఏళ్లుగా కంపెనీని నడుపుతున్నామని.. ఎన్నడూ ఎలాంటి ప్రమాదం జరగలేదని కంపెనీ తెలిపింది. ప్రమాదానికి రియాక్టర్ పేలుడు కారణం కాదని చెప్పింది. ప్రమాదంపై ప్రభుత్వ నివేదిక కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పుకొచ్చింది. 3 నెలల పాటు కంపెనీని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. బాధిత కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చింది. ఈ ఘటనలో ప్రభుత్వానికి అన్ని విధాల సహకరిస్తామని స్పష్టం చేసింది. మరోవైపు మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుంది. మృతదేహాలు కాలిపోవడంతో డీఎన్ఏ పరీక్షలు చేసి కుటుంబసభ్యులకు అప్పగిస్తున్నారు. ఇప్పటివరకు అధికారికంగాద 36 మృతదేహాలను గుర్తించగా.. అందులో 16 శవాలకు డీఎన్ఏ పరీక్షలు పూర్తయ్యాయి. ఆస్పత్రులు, ప్రమాద స్థలి వద్ద బాధిత కుటుంబాల రోదనలు అందరినీ కలిచివేస్తున్నాయి. కాగా భద్రతా ప్రమాణాలు పాటించని కెమికల్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. కంపెనీల్లో సేఫ్టీ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

# అదృష్టం బాగుండి సీఎం అయ్యావు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



కేసీఆర్ వాటర్ మ్యాన్ అయితే.. రేవంత్ రెడ్డి వాటా మ్యాన్ అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అదృష్టం బాగుండి సీఎం అయ్యావు, ఐదేళ్లు ఉండు.. మంచిగ చేయి. ఇప్పటికే నువ్వు తెలంగాణ ద్రోహిగా చరిత్రలో ఎక్కావు. తెలంగాణ ద్రోహి లిస్టులో మొదటి పేరు నీదే, కానీ రాష్ట్ర ద్రోహిగా మిగలకు. నీళ్లలో తెలంగాణకు అన్యాయం చేయకు, నిజాయితీగా పని చేయి. కుక్క తోక వంకర అన్నట్లు అబద్ధాలు మాట్లాడటం బంద్ చేయ్ అని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సూచించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడు. ఉత్తమ్ కుమార్ రెడ్డి తాను కూడా రేవంత్ రెడ్డి లాగా అబద్ధాలు మాట్లాడి ముఖ్యమంత్రి అవుదామని చూస్తున్నట్లు ఉన్నడు. ఎంతో కష్టపడి సీతారామకు అనుమతులు తెచ్చినం అని గొప్పలు చెప్పుకుంటున్నడు. 2023లోనే బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్, సీతమ్మ సాగర్‌కు 25 అనుమతులు వచ్చాయి. ఇందులో హైడ్రాలజీ, పర్యావరణం సహా అన్ని అనుమతులు ఉన్నాయి. అసెంబ్లీలో మాట్లాడుదామా హరీశ్ రావు అన్నడు. రేపు ఉదయం అసెంబ్లీ పెడితే నేను చర్చించేందుకు సిద్ధం. కానీ ఒక్క కండీషన్ మైక్ కట్ చేయొద్దు. 15 రోజులు కృష్ణా, 15 రోజులు గోదావరి మీద మొత్తం నెల రోజులు మాట్లాడుదాం. రేపే పెట్టు అసెంబ్లీ, ఎంత సేపైనా మాట్లాడు. అడ్జర్న్ చేయొద్దు, పారిపోవద్దు. మీరు ప్రజెంటేషన్ చేయి, మాకు ప్రెజెంటేషన్ చేసే అవకాశం ఇవ్వు. మీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అంటున్నడు, బనకచర్ల మీద ఉత్తరాలు రాయడం కాదు, చంద్రబాబు కోవర్టులు ఉన్నరు తెలంగాణలో అంటున్నడు. ఆ కోవర్టు ఎవరో అనిరుద్ చెబితే బాగుటుంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ

(మొదటి పేజీ తరువాయి)



ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రాష్ట్రానికి 5 లక్షల మెట్రిక్ టన్నుల కోటాను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిందని.. అందులో ఇప్పటి వరకు 3.06 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయిందని చెప్పారు.

అరకొర సరఫరా కారణంగా రాష్ట్రంలో దాదాపు 1.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడిరదని చెప్పుకొచ్చారు. తాజాగా జులై నెలకు నిర్దేశించిన సప్లై ప్లాన్ ప్రకారం రాష్ట్రానికి 1.60 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందన్నారు. కానీ అందులో 60 శాతం ఇంపోర్టెడ్ యూరియాను కేటాయించటం ఆందోళన కలిగిస్తోందని లేఖలో పేర్కొన్నారు. దిగుమతుల ద్వారా రాష్ట్రానికి రావాల్సిన యూరియా సకాలంలో రాష్ట్రానికి చేరుకునే పరిస్థితి లేదని, ఇప్పటి వరకు ఆ యూరియాను రవాణా చేసేందుకు అవసరమైన నౌకల కేటాయింపు జరగలేదని లెటర్‌లో ప్రస్తావించారు. దీంతో ఖరీఫ్? పంటలకు అనువైన సమయంలో యూరియా కొరత రైతులను ఆందోళనకు గురి చేస్తోందని మంత్రి తుమ్మల కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. యూరియా సరఫరాపై కేంద్రం తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జులై నెలకు కేటాయించిన 0.97 లక్షల మెట్రిక్ టన్నుల ఇంపోర్టెడ్ యూరియాకు నౌకలను కేటాయించాలని కోరారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి తెలంగాణకు స్వదేశీ యూరియా సరఫరాను 30,800 టన్నుల నుంచి 60,000 టన్నులకు పెంచాలని వినతి చేశారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు తలెత్తిన యూరియా లోటును భర్తీ చేయడానికి అదనపు కోటాను కేటాయించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లేఖలో కోరారు.

# సిగాచీ ఘటనా స్థలాన్ని పరిశీలించిన మంత్రి దామోదర రాజనర్సింహ



(మొదటి పేజీ తరువాయి)

భవనం శిథిలాలను పూర్తిగా తొలగిస్తేనే కనిపించకుండా పోయిన వారి వివరాలు లభిస్తాయని అంటున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యల్లో నిరంతరం తీవ్రంగా శ్రమిస్తున్నారు. భారీ క్రేన్లు, జేసీబీల సాయంతో శిథిలాలను ఒక్కొక్కటిగా తొలగిస్తున్నారు. ప్రమాదం గురించి అడిగి తెలుసుకుని.. సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇప్పటివరకు 36 మంది మరణించారని, ఇంకా 11 మంది కార్మికుల ఆచూకీ లభించడం లేదని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. పేలుడు సంభవించిన ప్రాంతాన్ని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సీనియర్ నేత జగ్గారెడ్డితో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. విపత్తు నిర్వహణ సిబ్బందిని అడిగి ప్రమాదం గురించి తెలుసుకున్నారు. బాధితుల బంధువులు, కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. 18 మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు : ఆచూకీ గల్లంతైనవారు బతికే అవకాశాలు తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. 18 మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసుపత్రుల్లో ట్రీట్‌మెంట్ పొందుతున్న కార్మికుల ఆరోగ్య పరిస్థితి కాస్త నిలకడగా ఉందని తెలిపారు. సిగాచీ కంపెనీ యాజమాన్యం ప్రమాద స్థలికి వచ్చిందని వారితో చర్చించినట్లు దామోదర రాజనర్సింహ వెల్లడిరచారు.

# బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి పిలుపు




(మొదటి పేజీ తరువాయి)

బుధవారం ఖమ్మంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు జులై 17వ తేదీన రైలు రోకో కార్యక్రమానికి పిలుపు నిచ్చామని తెలిపారు. ఈ రైలు రోకోలో అత్యధిక సంఖ్యలో పాల్గొని.. బీసీ రిజర్వేషన్లు ఉద్యమానికి మద్దతు తెలపాలంటూ ఖమ్మం జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా ఆమె పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క బీసీ బిడ్డ పాల్గొనాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తెలంగాణ రాష్ట్ర నూతన బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావుదే బాధ్యత అని కవిత స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా అంటేనే ఉద్యమాల ఖిల్లా అని గుర్తు చేశారు. అయితే వైరా నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఆలోచించండి.. అంతేకానీ బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసుల గురించి కాదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలకు కవిత చురకలంటించారు. పోలవరం బనకచర్ల నీటి విషయంలో ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు మాట్లాడాలని ఈ సందర్భంగా కవిత డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ ఇస్తామని అనేక సభలలో ఆ పార్టీ నేతలు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మరణం బీఆర్ఎస్ పార్టీతోపాటు ఖమ్మం జిల్లాకు తీరని లోటన్నారు. మదన్ లాల్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని చెప్పారు. మదన్‌లాల్ కుటుంబానికి తమ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా కవిత భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా రైలు రోకోకు బీఆర్ఎస్ పార్టీ పిలుపు నిచ్చింది. అందులో భాగంగా ఇటీవల అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు.

# యాజమాన్యం తప్పుంటే కఠిన చర్యలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

మృతుల్లో ఎక్కువగా జార్ఖండ్‌కు చెందిన వారు ఉన్నారని తెలిపారు. గుర్తించలేనంతగా కాలిపోయిన మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సందర్శించిన తర్వాతనైనా ఘటనపై వేగంగా దర్యాప్తు జరుగుతుందని ఆశిస్తున్నానని అన్నారు. ఈ ప్రమాదంలో సిగాచీ ఫార్మా ఫ్యాక్టరీ యాజమాన్యం తప్పిదం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని ఒవైసీ డిమాండ్ చేశారు. కాగా సిగాచీ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలిపేయి పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది.



# పాశమైలారం ఘటనపై నిపుణుల కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సంగారెడ్డి పాశమైలారం పేలుడు ఘటనపై తెలంగాణ ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. సీఎస్ఆర్ఐ శాస్త్రవేత్త వెంకటేశ్వరావు అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేసింది. చీఫ్ సైంటిస్ట్ ప్రతాప్‌కుమార్, సూర్యానారాయణ, పుణేకి చెందిన భద్రతా అధికారి సంతోష్ ఘుగేలను సభ్యులుగా నియమించింది. సిగాచి పరిశ్రమ ఘటనపై నెల రోజుల్లో కమిటీ అధ్యయనం చేసి నివేదిక ఇవ్వనున్నది. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడంతో పాటు భద్రతా నియమావళిని పాటించారా లేదా? తెలుసుకోవడంతో పాటు ప్రమాదాలు మళ్లీ జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలను కమిటీ ప్రభుత్వానికి సూచించనున్నది. కమిటీకి సహకారం అందించాలని డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పాశ మైలారంలోని సిగాచి పరిశ్రమలో సోమవారం రియాక్టర్ పేలిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటి వరకు 50 మందికిపైగా మృతి చెందారు. మరికొందరు కార్మికులు గాయపడగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 34 మంది క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. మరో వైపు ఈ ఘటనలో మృతదేహాల గుర్తింపు కొనసాగుతున్నది. మరో ఐదు మృతదేహాలను బాధిత కుటుంబాలకు అప్పగించారు. ఇప్పటి వరకు 18 మృతదేహాలను అధికారులు బాధిత కుటుంబాలకు అందించారు. గురువారం మరో 11 మంది కార్మికుల డీఎన్ఏ రిపోర్టులు అందనున్నాయి. ఆయా రిపోర్టుల ఆధారంగా మృతదేహాలను బంధువులకు అప్పగించనున్నారు. ఈ ఘటనలో మరో 11 మంది గల్లంతైన విషయం తెలిసిందే. వారి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.





# రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను సరి చేస్తూ, పేదలకు ఇచ్చిన ఒక్కో హామీ అమలు....

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:



రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను సరి చేస్తూ, పేదలకు ఇచ్చిన ఒక్కో హామీ అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రి వర్యులు, బుధవారం సాయంత్రం ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మునిసిపల్ ప్రాంతంలో పర్యటించారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లు గ్రామంలో పొన్నెకల్లు నుండి నర్సింహాపురం వయా పొన్నేకల్ చెరువు వరకు 2 కోట్ల 53 లక్షల రూపాయలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, పొన్నెకల్ గ్రామంలో (18) మంది డబల్ బెడ్రూం లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఆధునీకరించిన ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ ను స్థానిక ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏదులాపురం నుండి గొల్లగూడెం రోడ్డు వయా ఆదిత్య నగర్ లింకు రోడ్డు వరకు 88 లక్షలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులకు, ఏదులాపురం నుండి గొల్లగూడెం ముత్తగూడెం జెడ్పీ రోడ్డు వరకు 83 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో ఇందిరమ్మ ప్రభుత్వ పాలన వచ్చిందని, పేదలకు అండగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. గత పాలకులు అమలు చేసిన సంక్షేమం కొనసాగిస్తూ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ హాస్టల్స్ లలో డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్స్ చార్జిలను 200 శాతం పెంచామని అన్నారు.

గత ప్రభుత్వం రైతుకు పెట్టుబడి సహాయం ఎకరానికి 10 వేల రూపాయలు అందిస్తే, ప్రజా ప్రభుత్వం రైతులకు అందించే సహాయం 12 వేలకు పెంచి, 9 రోజుల వ్యవధిలో దాదాపు 9 వేల కోట్ల రూపాయలను 70 లక్షల రైతులకు సంబంధించి సుమారు కోటి 49 లక్షల ఎకరాలకు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసామని అన్నారు. గత ప్రభుత్వ హయంలో పేదలకు ఇల్లు నిర్మించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ప్రతి గ్రామంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ప్రస్తుత ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందిస్తుందని అన్నారు. రాబోయే మూడున్నర సంవత్సరాలలో మరో 3 విడతల్లో అర్హులైన పేదలను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని అన్నారు. కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో భూములు కోల్పోయిన (42) మంది భూ నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశామని, ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వారికి కూడా ప్రభుత్వం తప్పనిసరిగా ఇంటి పట్టాలు మంజూరు చేస్తుందని అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీలో కోటి 46 లక్షల రూపాయలతో అనేక సీసీ రోడ్లు పూర్తి చేసుకున్నామని, 45 కోట్ల రూపాయలతో తరుణి హాట్ లో సమీకృత కార్యాలయాల కాంప్లెక్స్ నిర్మాణం చేస్తామని అన్నారు. విద్యుత్ సమస్య పరిష్కరించేందుకు ఏదులాపురంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ త్వరలో పూర్తి చేసుకోనున్నామని అన్నారు. ఏదులాపురం ప్రాంతంలో అర్హులైన పేదలను గుర్తించి ఇంటి స్థలాలు అందిస్తామని అన్నారు. ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ మున్నేరు వాగులో డ్యామేజ్ జరిగిన ఇండ్లకు బదులుగా పేదలకు ఇంటి పట్టాలు అందిస్తున్నామని అన్నారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. 12 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తూ పేదలకు నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, రైతు భరోసా కింద 9 వేల కోట్ల రూపాయలు సహాయం అందించామని, 50 లక్షల ఇళ్లకు నెలకు 200 యూనిట్ల వరకు జీరో బిల్ తో విద్యుత్తు అందిస్తున్నామని, మహిళలకు సంవత్సరానికి 3 వేల 700 కోట్లు ఖర్చు చేసి ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సిసి రోడ్లను పూర్తి స్థాయిలో వేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లను దశల వారీగా పూర్తి స్థాయిలో అర్హులకు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ ఏ. శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రామ్ ప్రసాద్, మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్నేరు కరకట్ట నిర్మాణాన్ని తొందరగా పూర్తి చేయాలి

- కరకట్ట ఎత్తును వెడల్పును పెంచాలి.
- సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై విక్రమ్,యర్రా. శ్రీనివాసరావు డిమాండ్.

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:



మున్నేరు కరకట్ట నిర్మాణాన్ని తొందరగా పూర్తి చేయాలి. కరకట్ట ఎత్తును వెడల్పును పెంచాలి అని సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై విక్రమ్,యర్రా శ్రీనివాసరావు లు అన్నారు. బుధవారం సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో 35వ డివిజన్లో మోతీ నగర్ లో నిర్మాణం అవుతున్న మున్నేరు కరకట్టను సిపిఎం ప్రతినిధి బృందం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై విక్రమ్,యర్రా శ్రీనివాసరావు లు మాట్లాడుతూ గత సంవత్సరం వచ్చిన వర్షాలకు మున్నేరు ఉప్పొంగి ఖమ్మం ప్రాంతంలో కాలవొడ్డు, మోతీ నగర్, బొక్కల గడ్డ, పంపింగ్వేల్ రోడ్డు, పెద్దమ్మ తల్లి గుడి ఏరియా, సుందరయ్య నగర్, ప్రకాష్ నగర్, ధంసలాపురం ఏరియాలో మొత్తం కూడా ఇండ్లలోకి నీరు చేరు తీవ్ర నష్టం జరిగిన సంగతి తెలిసిందే ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో ముఖ్యంగా ఖమ్మం పట్టణంలో ఇంత నష్టం జరిగితే కేవలం 16,500 ఇచ్చి చేతులు దులుపుకుంది. వరదకు చాలా ఇండ్లు తీవ్రంగా దెబ్బతిని ఇంట్లో సామాన్లు మొత్తం ఆగం అయిపోయినాయి. సంవత్సరం కాలం గడుస్తున్న కరకట్ట నిర్మాణం పనులు పూర్తి కాలేదు. పనులు నత్త నడక నడుస్తున్నాయి. ప్రజలు చాలామంది భయాందోళన గురవుతున్నారు. తొందరగా కరకట్ట నిర్మాణం పూర్తి చేయాలని కరకట్ట భూ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారాన్ని ఇవ్వాలి. భూ నిర్వాసితులకు ప్రభుత్వ స్థలం ఎన్నెస్పీ క్యాంపులో గాని వెలుగుమట్లలో గాని ఇండ్లు కట్టించి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, సిపిఎం సీనియర్ నాయకులు బండారు యాకయ్య, సిపిఎం ఖమ్మం 3 టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ సైదులు, షేక్ హి మామ్, సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ నాయకులు వేల్పుల నాగేశ్వరరావు, షేక్ అమీనా, షేక్ ఖాసిం, డొంగోరోతు శంకర్, సిద్ధల రాజు, తమ్మినేని రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా రంగాల ఉద్యోగులకు చిరుకానుకలు!

సత్తుపల్లి,ఆర్ సి,తెలంగాణ ముచ్చట్లు:



ఖమ్మం జిల్లా, కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని సేవా రంగాలలో పని చేసే 108 ,102 మరియు విద్యుత్ శాఖ ఉద్యోగులకు బుధవారం పోట్రు లక్ష్మయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధినేత ప్రవీణ్ జన్మదినం సందర్భంగా రెయిన్ కోటు లు వితరణ చేశారు. పట్టణంలోని దళితవాడలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు ,మిఠాయిలు, పెన్నులు,పెన్సిల్లు పంపిణీ చేశారు. మండల పరిధిలోని యజ్ఞ నారాయణపురం గ్రామంలో స్నేహితులు తో కలిసి కేక్ కటింగ్ చేసి జన్మదిన వేడుక ను ఘనంగా జరుపుకొన్నారు.

# సామాజిక కార్యకర్తను అభినందించిన ఎమ్మెల్యే

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:



వనపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి చేతుల మీదుగా నూతనంగా జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమీటీ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్ గౌడ్ ను ఎమ్మెల్యే సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్ గౌడ్ ను శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ.. మా సొంత మండలం పక్క గ్రామమైన వెంకట్ గౌడు గత కొన్ని సంవత్సరాల నుండి సామాజిక కార్యకర్తగా ఎన్నో సేవా కార్యక్రమాలలో పాలు పంచుకొని ప్రజలకు తన వంతు సహకారాన్ని అందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలలో పాలు పంచుకొని ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరే విధంగా పత్రిక రంగంలో కూడ తన సేవలను కొనసాగిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి మరిన్ని సేవలు అందించాలని ఆయన కోరారు.

# ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

- ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:

బుధవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు.తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచిస్తూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు .ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి ఫోన్ ద్వారా తమ సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే కు వివరించారు.ఇందిరమ్మ ఇండ్లు, సీసీ రోడ్లు, మురుగు కాలువలు, ఆర్టీసీ బస్సు సౌకర్యం, హిందూ స్మశాన వాటిక స్థలం కేటాయింపు, వనపర్తి జిల్లా కేంద్రం చుట్టూ అభివృద్ధి చేసే విధంగా చర్యలు, పీర్లగుట్ట చదును, లాంటి అనేక సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకోవడం అందుకు ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కార కోసం వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఒక్కరు తనను ఒక కుటుంబ సభ్యుని లాగా భావించాలని తనతో నేరుగా మాట్లాడి సమస్యలను వివరించవచ్చునని ఆయన సూచించారు.




# ఉపాధి సంబంధిత ప్రోత్సాహక పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి...

- వరంగల్ ప్రాంతీయ పీఎఫ్ కమీషనర్ శ్రీనివాస్

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

ఉపాధి సంబంధిత ప్రోత్సాహక (ఈ.ఎల్.ఐ.) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ ప్రాంతీయ పీ.ఎఫ్. కమీషనర్ వై.డి. శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 99 వేల 446 కోట్ల ఆర్థిక వ్యయంతో 2 ఏండ్ల వ్యవధిలో 3.5 కోట్లకు పైగా ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి సంబంధిత ప్రోత్సాహక పథకాన్ని ఆమోదించిందని, ఇందులో కోటి 92 లక్షల మంది తొలిసారిగా ఉద్యోగంలో ప్రవేశించే లబ్ధిదారులు ఉంటారని అన్నారు. ఉపాధి సంబంధిత ప్రోత్సాహక పథకంలో తొలిసారి ఉద్యోగంలోకి వచ్చేవారికి ప్రోత్సాహకం, యజమానులకు మద్దతు రెండు భాగాలు ఉంటాయని అన్నారు. తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి సారించి ఈ పథకం అమలు చేస్తామని అన్నారు. ఈ పథకం ప్రయోజనాలు 2025 ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31 మధ్య సృష్టించబడిన ఉద్యోగాలకు వర్తిస్తాయని అన్నారు. వ్యవస్థీకృత రంగాలలో కొత్తగా ఉద్యోగం లోకి వచ్చే వారికి ఒక నెల జీతం (గరిష్టంగా 15 వేల రూపాయల) రెండు విడతలుగా బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని, మొదటి విడత 6 నెలల సేవా అనంతరం, రెండవ విడత 12 నెలల సేవ, ఆర్థిక సాక్షరత కార్యక్రమం పూర్తి చేసిన తర్వాత అందిస్తామని, నెలకు లక్ష రూపాయల లోపు జీతం ఉన్నవారికి ఈ పథకం అమలు అవుతుందని, కోటి 92 లక్షల మంది లబ్ధిదారులకు ఈ పథకం అమలు చేస్తామని అన్నారు. యజమానులకు మద్దతు క్రింద అన్ని రంగాలలో ఉద్యోగాల సృష్టికి ప్రోత్సాహకాలు అందిస్తామని, ముఖ్యంగా తయారీ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ప్రతి కొత్త ఉద్యోగికి యజమానులకు నెలకు 3000 రూపాయల ప్రోత్సాహం రెండు సంవత్సరాల పాటు అందిస్తామని, తయారీ రంగానికి ఈ ప్రోత్సాహకాలు మూడు, నాలుగు సంవత్సరాలకు పొడిగించబడతాయని అన్నారు. 50 మందికి తక్కువ ఉద్యోగులు ఉన్న సంస్థలు కనీసం 2 కొత్త ఉద్యోగులను, 50 కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు కనీసం 5 మంది కొత్త ఉద్యోగుల నియమించి ఆరు నెలల పాటు నిరంతర సేవ చేస్తే ఈ పథకం అమలుకు అర్హులు అవుతారని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి సంబంధిత ప్రోత్సాహక పథకం అర్హులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని మరింత సమాచారం కోసం వరంగల్ పిఎఫ్ కార్యాలయాన్ని సంప్రదించాలని వరంగల్ ప్రాంతీయ పీ.ఎఫ్ కమీషనర్ వై.డి. శ్రీనివాస్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# 200 సీట్లకంటే ఎక్కువే గెలుస్తాం

- తమిళ భాషా సంస్కృతి, సంప్రదాయాలకు హాని కలిగించడమే పనిగాపెట్టుకున్న బీజేపీ
- ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

**చెన్నై:**

వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి 200 సీట్లకన్నా ఎక్కువ స్థానాలు గెలుచుకోవటం ఖాయమని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. తేనాంపేటలోని అన్నా అరివాలయంలో 'ఏకతాటిపై తమిళనాడు' అనే పేరుతో ప్రతి పోలింగ్ కేంద్రంలోను 30 శాతం మంది ఓటర్లకు డీఎంకే సభ్యత్వం కల్పించే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఏకతాటిపై తమిళనాడు' పేరుతో 45 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపోలింగ్ పరిధిలో 30 శాతం మంది ఓటర్లను పార్టీలో చేర్చుకునే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీకి చెందిన స్థానిక నాయకులు ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారి ఇళ్లకు కూడా వెళ్ళి, ద్రావిడ తరహా డీఎంకే పాలన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించి వారిని ఆకట్టుకుని పార్టీలో చేరేలా ప్రేరేపించనున్నట్లు ఆయన చెప్పారు. తమిళ భాషా సంస్కృతి, సంప్రదాయాలకు హాని కలిగించడమే పనిగాపెట్టుకున్న బీజేపీ కపటనాటకాలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వివరించి, వారికి డీఎంకే సభ్యత్వం కల్పించాలని పిలుపునిచ్చారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు డీఎంకే సిద్ధంగానే ఉందని, ఆ ఎన్నికల్లో గెలుపు ఖాయమని, గతంలో తాను చెప్పినట్లు 200 సీట్ల కంటే అధిక సీట్లలోనే గెలుస్తామని పేర్కొన్నారు.







# నిరుపేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు...

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

నిరుపేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంత్రివర్యులు బుధవారం రఘునాధ పాలెం మండలం చిమ్మపూడి గ్రామంలో పర్యటించి ఎస్సీ కాలని నందు 80 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు, 4 కోట్ల 95 లక్షలతో చిమ్మపూడి నుండి పండితాపురం సంత వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, కోటి 50 లక్షలతో చిమ్మపూడి నుండి మంచుకొండ వరకు నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ గ్రామంలో గుడిసెల్లో ఉండే నిరుపేదలను మొదటి విడత క్రింద ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, ఎదుగుదలను నిరంతరం మానిటరింగ్ చేయాలని, పెండింగ్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. దశల వారీగా ఊరిలో పూరి గుడిసే లేకుండా అర్హులందరికీ ఇండ్లు అందించాలని, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలని అన్నారు. 12 వేల కోట్ల రూపాయలతో సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, 25 వేల కోట్లతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, 9 వేల కోట్ల రైతు భరోసా, 33 కోట్లతో చేనేత రుణమాఫీ చేశామని అన్నారు.

గతంలో చిమ్మపూడి గ్రామానికి రోడ్డు లేదని, ప్రస్తుతం అటువంటి మౌళిక వసతుల కల్పన పనులు పూర్తి చేశానని అన్నారు. ప్రజల పిల్లలు చదువుకునేందుకు రఘునాధపాలెం మండలంలో స్వామి నారాయణ స్కూల్, సమీకృత గురుకుల పాఠశాలలు ఏర్పాటు అవుతున్నాయని, విద్య ద్వారానే పేదరికం దూరం అవుతుందని, పిల్లలకు తప్పనిసరిగా చదువు చెప్పించాలని అన్నారు. బుగ్గ వాగు ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా కార్యాచరణ చేపట్టామని అన్నారు. గ్రామాలు పచ్చగా, పరిశుభ్రంగా ఉండాలని, అందరూ సంతోషంగా, ఆనందంగా వుండాలని మంత్రి అన్నారు. సమస్యలు ఒక్కొక్కటిగా అన్నిటినీ పూర్తి చేస్తామన్నారు. పేదలకు, రైతులకు, భవిష్యత్తులో పిల్లలకు ఏం కావాలి ఆలోచించుకొని మంచి కార్యక్రమాలు చేపట్టి, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. కుల, మత, రాజకీయలకతీతంగా అందరూ సామరస్యంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, ఆర్డీఓ నరసింహా రావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఇఇ పవార్, రఘునాధపాలెం మండల తహాసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్ కుమార్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్–1 మేన్ పరీక్షలపై హైకోర్టులో టీజీపీఎస్సీ వాదనలు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

గ్రూప్-1 పరీక్షలను పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహించామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) హైకోర్టులో వాదనలు వినిపించింది. మూల్యాంకనం, హాల్ టికెట్ల జారీపై పిటిషనర్ల వాదనను తప్పుబట్టింది. వందల పోస్టులకు లక్షల సంఖ్యలో అభ్యర్థులు పరీక్ష రాసినప్పుడు ఇలాంటి ఆరోపణలు సహజమేనని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ అయ్యర్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేసింది.



2024, అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు, అసమానతలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట శివనగర్‌కు చెందిన కె.పర్శరాములుతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు బుధవారం విచారణ కొనసాగించారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదిస్తూ.. ఈ గ్రూప్-1లో ఎంపికవుతున్న వారు సమాజానికి కీలకమైన సేవలందిస్తారని, వీరంతా భవిష్యత్ తెలంగాణకు వెన్నెముక లాంటి వారని అన్నారు. వీరి ఎంపిక పారదర్శకంగా జరగకపోతే ప్రమాదకమని పేర్కొన్నారు. టీజీపీఎస్సీ తరపున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. రాజ్యాంగ సంస్థల అంశాల్లో సెక్షన్ 226 ప్రకారం రెండు సందర్భాల్లో మాత్రమే హైకోర్టు జోక్యం చేసుకోగలదని చెప్పారు. మోసపూరితంగా నిర్వహించినా, నిబంధనలను ఉల్లంఘించినా న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోవచ్చని వెల్లడించారు.

**బండిల్ ఆధారంగా అభ్యర్థిని తెలుసుకోలేరు.**

'ఒక్కో పేపర్ ముగ్గురితో దిద్దించాం. ఇద్దరు ఇచ్చిన అత్యధిక మార్కుల సరాసరిని పరిగణనలోకి తీసుకుని ఫలితాలు వెల్లడించాం. అందరు అభ్యర్థులకు ఇదే విధానాన్ని అనుసరించాం. పదే పదే మూల్యాంకనం అన డం కాదు.. అంతా కలిపి ఒక ప్రక్రియ. బండిల్ ఆధారంగా సెంటర్, అభ్యర్థిని తెలుసుకునే అవకాశమే లేదు. బార్ కోడ్ అధారంగానే జవాబు పత్రాలు దిద్దడానికి ఇవ్వడం జరుగుతుంది. ఆ బార్ కోడ్, అభ్యర్థి ఎవరో మూల్యాంకనం చేసే వారికి తెలిసే అవకాశమే లేదు.

ఒకట్రెండుసార్లు చిన్న చిన్న తప్పులు జరగడం సాధారణం. అయినంత మాత్రాన రాజ్యాంగబద్ధమైన సంస్థను పదే పదే తప్పుబట్టడం సరికాదు. ప్రక్రియనంతా ప్రధాన మూల్యాంకన దారు పర్యవేస్తుంటారు. నంబర్లు ఒక ఆర్డర్‌లో ఉండటం కోసమే మెయిన్స్‌కు విడిగా హాల్‌టికెట్లు ఇచ్చాం. గతంలో పోలీస్ బోర్డు, జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలకు కూడా ఇలాగే పరీక్షలు నిర్వహించారు.

హాల్‌టికెట్లను అక్టోబర్‌లో జారీ చేశాం. దీనిని చాలెంజ్ చేస్తూ ఎవరూ కోర్టుకు రాలేదు. హాల్ టికెట్ అందలేదన్న అభ్యర్థులూ లేరు. అక్టోబర్‌లో జారీ చేసిన హాల్‌టికెట్లను మార్చి వరకు ఆగి, ఫలితాలు వెల్లడించాక ఎంపిక కాలేదని తెలుసుకుని చాలెంజ్ చేయడం సమంజసం కాదు'అని టీజీపీఎస్సీ న్యాయవాది వాదించారు. అనంతరం న్యాయమూర్తి తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

# కాల్పుల విరమణకు అంగీకరించండి



గాజాలో 60 రోజుల పాటు కాల్పుల విరమణకు అవసరమైన షరతులకు ఇజ్రాయెల్ అంగీకరించిందని, దీనికి హమాస్ కూడా ఒప్పుకోవాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రతిపాదన కార్యరూపం దాల్చే సూచనలు కనిపించడం లేదు. ట్రంప్ ప్రతిపాదనపై ఇజ్రాయెల్, హమాస్‌లు తమ తమ పాత వైఖరులనే పునరుద్ఘాటిస్తూ పరస్పరం భిన్నంగా ప్రతిస్పందించాయి. కాల్పుల విరమణ ఒప్పందానికి సిద్ధమేనని తెలిపిన హమాస్...గాజాపై యుద్ధాన్ని శాశ్వతంగా ఇజ్రాయెల్ ముగిస్తామంటేనే సంధి చేసుకుంటామని స్పష్టం చేసింది. గాజా భూభాగాల నుంచి ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వెనక్కు వెళితే దానికి బదులుగా మిగిలిన 50 మంది బందీలను విడుదల చేస్తామని తీవ్రవాద సంస్థ ప్రతినిధి తాహెర్ అల్‌నును తెలిపారు. యుద్ధాన్ని ముగిస్తామంటే చర్చలకు సిద్ధమేనని వెల్లడించారు. అయితే, ఆయుధాలు అప్పగించి హమాస్ లొంగిపోవాలని, పాలస్తీనాను వీడి వెళ్లిపోవటానికి అంగీకరిస్తేనే 60 రోజుల కాల్పుల విరమణకు అంగీకరిస్తామని ఇజ్రాయెల్ తెలిపింది. యుద్ధానంతరం గాజాలో హమాస్ కనిపించడానికి వీల్లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టంచేశారు.

# పంట పొలాల నుండి జనం శరీరాల్లోకి కృత్రిమ రసాయనాలు

భూమిలో సహజంగా ఉండే పోషకాలతో పాటు సేంద్రీయ ఎరువుల ద్వారా గతంలో భూసారం తగ్గకుండా సూక్ష్మ స్థూల పోషకాలు ఘననియంగా అందేవి. హరిత విప్లవం కారణంగా 1965 70 ప్రాంతం నుండి కృత్రిమ ఎరువుల పైన ఆధారపడిన కారణంగా దిగుబడి ఎక్కువగా కావాలనే నెపంతో ఎరువులు పురుగు మందుల వాడకం పెరిగి అదుపు చేయలేని దుస్థితికి చేరుకోవడం వల్ల నేడు పంట పొలాల్లో విచ్చల విడిగా చల్లుతున్నటువంటి రసాయనిక పదార్థాలు జనం శరీరాల్లోకి చేరి గుల్లబారుస్తున్న విషయాన్ని మనం ఆలస్యంగానైనా గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎరువులు పురుగు మందుల వాడకాన్ని విచ్చలవిడిగా వాడుతున్న దేశాలలో భారతదేశం కూడా ఒకటి కావడం ఆందోళనకరమైతే 2023 24 సంవత్సరంలో భారత దేశవ్యాప్తంగా 64.84 మిలియన్ మెట్రిక్ టన్నుల రసాయన ఎరువులను పంట పొలాలలో కుమ్మరించినట్లు తెలుస్తుంది. జాతీయ సగటుకు రెట్టింపు స్థాయిలో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఇతర రాష్ట్రాలలో ఎరువు లను కుమ్మరించడం మించిపోయిన కారణంగా ఆరోగ్య రక్షణ,ఆహార భద్రత, ప్రజాసంక్షేమం, సంక్షోభంలో పడే ప్రమాదం లేకపోలేదు. అధిక ఫలాన్ని ఆశించి పొలాలలో ఎరువులను విపరీతంగా చల్లడంతో పంట చేలకు చీడపీడల బెడద ఎక్కువై క్రిమిసంహారక మందులు చల్లవలసి రావడంతో పెట్టుబడి తడిసి మోపెడుతున్నది.



.రసాయన అవశేషాలు ఆహారం ద్వారా శరీరంలోకి పోయి క్యాన్సర్లు ఇతర భయంకరమైన అనారోగ్య సమస్యలకు ప్రజలు బలి అవుతుంటే ఆయా కుటుంబాల ఖర్చు కూడా గణనీయంగా పెరిగిపోయింది. నత్రజని ఫాస్పరస్ పొటాషియం ఎన్పీకే నిష్పత్తి 4:2:1కి నించకూడదని నిబంధన ఉంటే గత సంవత్సరం 10:3:7 గా నమోదు అయినట్లు తెలుస్తున్నది. ఒక దశలో భారత దేశంలో పంజాబ్ తర్వాత ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో రసాయ న ఎరువుల వాడకం ఎక్కువగా ఉందని దాన్ని తగ్గించాలని కేంద్రం సూచన చేసినప్పటికీ పరిస్థితుల్లో మార్పు రాకపోవడం, భూసార పరీక్షలను పట్టించుకోకుండా ఇష్టం ఉన్నట్టుగా వ్యవహరించడం వల్ల నేలలు సారాన్ని కోల్పోయి దిగుబడి తగ్గి అన్ని రకాల నష్టానికి కారణం అవుతున్న రసాయన ఎరువులు పురుగు మందుల వాడకాన్ని నిర్బంధంగా తగ్గించి తీరాల్సిన అవసరం ఉంది.

సుమారు 50 సంవత్సరాలపైగా దేశంలో ఎరువుల వాడకంలో వచ్చిన మార్పుల కారణంగా పండిరచిన పంటలు వరి గోధుమల్లో ఐరన్ జింక్ వంటి పోషక విలువలు తగ్గి నామ మాత్రంగా మిగిలిపోయినాయి. వరిలో ప్రమాదకరమైన ఆర్సినిక్ పెద్ద మొత్తం లో పేరుకుపోవడం అనారోగ్యకరం. వీటికి తోడు జీవనశైలి తగినట్లు లేకపోవడం వల్ల అనేక రోగాల బారిన ప్రజలు పడక తప్పడం లేదు. భూములు నిస్సారమై పోషకాహారం అందక జన భారతం గగ్గోలు పెడుతున్నది. ఈ దుర్భర పరిస్థితుల నుండి భారతదేశాన్ని గట్టెక్కించాలంటే సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం కీలకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ వైపుగా కేంద్రం సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించి రాబోయే రెండు సంవత్సరాల లో 2,481 కోట్ల ఖర్చు చేయాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. రైతులను అందుకు సమాయత్తం చేయడం, జనంలో చైతన్యం తీసుకురావడం, విచ్చలవిడి ఎరువుల వాడకాన్ని చాలా అదుపు చేయడం అవసరమైతే ఎరువుల వాడకం పైన వ్యతిరేక ప్రచారం చేయడం వల్ల సమాజం కూడా తన వంతు బాధ్యత పోషించాల్సిన అవసరం ఉంది. 7.5 లక్షల హెక్టార్లలో సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయాన్ని చేపట్టి కోటి మంది రైతులకు కొత్త ఒరవడి చూపించాలన్నది కేంద్ర ప్రభుత్వ నిర్ణయం. ఈ నిర్ణయం అమలు కావాలంటే, ఆరోగ్యకరమైనటువంటి పోషకాహారం ప్రజలకు అందించాలంటే, అనేక రోగాల బారి నుండి ప్రజలను కాపాడాలంటే, నూతన పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను మార్చవలసిన అవసరం చాలా ఉన్నది. కేవలం కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే సరిపోదు రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటు రైతుల సమాయత్తం చేసే కృషి కీలకం.అదే దశలో ఎరువులు పురుగుమందుల యొక్క తయారీ ఉత్పత్తుల కంపెనీలను సగానికి సగం తగ్గించడం తో పాటు భూసార పరీక్షలను ప్రతి ఏటా నిర్వహించడం ద్వారా ప్రభుత్వాలే రైతులకు భరోసాను కల్పించాల్సిన అవసరం ఉన్నది. భూసార పరీక్షల ఫలితాలను బట్టి అవసరమైనటువంటి పోషకాలను ఆ భూమికి అందించడానికి కృషి జరగాలి ఆ వైపుగా పరిశోధనలు మరింత ముమ్మరం చేయాలి. విచ్చలవిడిగా తయారవుతున్నటువంటి చెత్త నుండి ఎరువులను తయారు చేయడం వళ్ళ చెత్తకు ఒకరకంగా పరిష్కారాన్ని చూపడంతో పాటు సేంద్రీయ ఎరువును అవసరమైన మేరకు ఉత్పత్తి చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. తక్కువ ఖర్చుతో సేంద్రియ ఎరువు సమీకరణ వలన రైతు పైన కూడా ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంటుంది. ఇదంతా జరగాలంటే రైతులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాలి, నమ్మకాన్ని కలిగించాలి, పంటల దిగుబడి కి ఎలాంటి నష్టం లేదని భరోసాను ప్రభుత్వాలు శాస్త్రవేత్తలు ఇవ్వగలగాలి,అవసరమైతే నష్టం జరిగిన సందర్భంలో తొలిదశలో నష్టపరిహారాన్ని కూడా ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాలి, క్రమంగా సేంద్రీయ ఎరుల వాడకం వైపు ఈ దేశంలో వ్యవసాయం మార్పు చెందితే అనారోగ్య సమస్యలు క్రమంగా వాటంతట అవే తగ్గుతాయి.




# పెరిగిన జీఎస్టీ వసూళ్లు...

రూ.1.84 లక్షల కోట్లు జీఎస్టీ వసూళ్లు మరింత పెరిగాయి. గత నెలకుగాను రూ.1.84 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడిరచింది. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.1,73,813 కోట్లతో పోలిస్తే 6.2 శాతం అధికమయ్యాయి. మే నెలలో వసూలైన రూ.2.01 లక్షల కోట్లతో పోలిస్తే భారీగా తగ్గాయి. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రూ.2.37 లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూలయ్యాయి. దీంట్లో భాగంగా జూన్ నెలలో వసూలైన రూ.1.84 లక్షల కోట్లతో దేశీయ లావాదేవీలు 4.6 శాతం అధికమై రూ.1.38 లక్షల కోట్లు నమోదు కాగా, దిగుమతి చేసుకునే వస్తువులపై విధించే జీఎస్టీ 11.4 శాతం ఎగబాకి రూ.45,690 కోట్లకు చేరుకున్నాయి. ఈ జీఎస్టీ వసూళ్లలో స్థూల సెంట్రల్ జీఎస్టీ కింద రూ.34,558 కోట్లు, స్టేట్ జీఎస్టీ కింద రూ.43,268 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద రూ.93,280 కోట్లు వసూలయ్యాయి. దీంతోపాటు సెస్ రూపంలో రూ.13,491 కోట్లు వసూలయ్యాయి. రిఫండ్ రూపంలో రూ.25,491 కోట్లు చెల్లించింది.

# భారతీయ రైల్వే సేవలు ఒకేచోట..!




భారతీయ రైల్వే కొత్త యాప్ 'రైల్ వన్' యాప్‌ని ప్రారంభించింది. ప్రయాణికులకు ఒకేచోట అన్ని సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో సూపర్ యాప్‌ని తీసుకువచ్చింది. ఐఆర్‌సీటీసీ రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్, ప్లాట్‌ఫామ్ టికెట్లను బుక్ చేసుకోవడంతో పాటు పీఎన్‌ఆర్ స్టేటస్, రైలు స్టేటస్ ట్రాక్, కోచ్ పొజిషన్, రైల్ మదద్ సేవలు అందించడంతో పాటు అభిప్రాయాలను సైతం ఒకే యాప్ ట్రాక్ చేయనున్నది. స్పష్టమైన ఇంటర్‌ఫేస్ యూజర్లకు మరింత మెరుగైన అనుభవం అందించేందుకు యాప్‌ని పరిచయం చేరసింది. భారతీయ రైల్వే వివిధ అన్ని సేవలను ఒకే చోట ఏకీకృతం చేస్తుంది. కొత్త రైల్ వన్ యాప్ గూగుల్ ప్లే స్టోర్, ఐఓఎస్ యాప్ స్టోర్ డౌన్‌లోడ్ చేరసుకునేందుకు అందుబాటులో ఉన్నది. గతంలో భారతీయ రైల్వేల సేవలకు వివిధ యాప్స్ ఉండేవి. దాంతో అన్ని పాస్‌వర్డ్‌లను గుర్తుంచుకోవడం ఇబ్బందికరంగా ఉండేది. ఈ యాప్‌తో ఒకేసారి సైన్ ఇన్ అవడంతో ఎక్కువ పాస్‌వర్డ్‌లు గుర్తుంచుకోవాల్సిన పని తప్పింది. యూజర్లు యాప్‌ను డౌన్‌లోడ్ చేసిన తర్వాత ప్రస్తుతం ఉన్న రైల్ కనెక్ట్ లేదంటే యూటీఎస్‌ఆన్‌మొబైల్ ఐడీని ఉపయోగించి లాగిన్ అవ్వొచ్చు. ఎంపిన్, బయోమెటిక్ ద్వారా అకౌంట్‌ను యాక్సెస్ చేసుకోవచ్చు. ఎంక్వైరీ కోసం మొబైల్ నంబర్/ఓటీపీ అథంటికేషన్ ద్వారా గెస్ట్ యాక్సెస్ సైతం అందుబాటులో ఉంది. ప్రస్తుతం ప్రయాణికులు ప్రస్తుతం వివిధ సేవల కోసం బహుళ యాప్‌లు, వెబ్‌సైట్‌లను యాక్సెస్ చేస్తున్నారు. టికెట్ల బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్ట్, భోజనం ఆర్డర్ చేయడానికి ఐఆర్‌టీసీ ఈ క్యాటరింగ్ ఫుడ్ ఆన్ ట్రాక్, ఫీడ్‌బ్యాక్ అందించేందుకు రైల్ మదద్, అన్ రిజర్వ్‌డ్ టికెట్ల కోసం యూటీఎస్, రైలు స్టేటస్ తెలుసుకునేందుకు నేషనల్ ట్రైన్ ఎంక్వైరీ సిస్టమ్‌ను వినియోగిస్తున్నారు. టికెట్ల బుకింగ్ కోసం ప్రత్యేక హక్కులు ఉన్న ఆర్‌సీటీసీ రైల్ కనెక్ట్ 100 మిలియన్స్ డౌన్‌లోడ్స్‌ను అధిగమించింది. ఈ యాప్ రైల్వేలోనే అత్యంత ప్రజాదారణ ఉన్న యాప్‌ను నిలిచింది. ఇతర ప్లాట్‌ఫామ్స్ సైతం టికెట్ బుకింగ్స్ కోసం ఐఆర్‌సీటీసీపైనే ఆధారపడుతుంటాయి. ఇదిలా ఉండగా.. ఇటీవల భారతీయ టికెట్ల బుకింగ్‌లో పలు మార్పులు చేసింది. ప్రయాణీకుల రిజర్వేషన్ వ్యవస్థలో గణనీయమైన మార్పులను అమలు చేస్తోంది. ప్రస్తుతం రైలు బయలుదేరడానికి నాలుగు గంటల ముందు చార్ట్ తయారవుతుండగా.. ఇకపై ఎనిమిది గంటల ముందే రైల్వే చార్ట్‌ను ప్రిపేర్ చేయనున్నది. దాంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పనున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు గంటలకు బయలుదేరే చార్ట్ ముందురోజు రాత్రి 9 గంటలకు చార్ట్ రెడీ అవుతుంది. మరో వైపు తత్కాల్ టికెట్ బుకింగ్‌లోనూ రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. తత్కాల్ టికెట్లు బుకింగ్‌కు ఆధార్ అథంటికేషన్ తప్పనిసరి చేసింది. దళారులకు అడ్డుకట్ట వేసేందుకు రైల్వేశాఖ ఆధార్‌తో అనుసంధానించింది.




# హైదరాబాద్‌లో ఎస్బీఐ గ్లోబల్ ట్రేడ్ సెంటర్

ఎస్బీఐ.. హైదరాబాద్‌తోపాటు కోల్‌కతాలో గ్లోబల్ ట్రేడ్ ఫైనాన్స్ సెంటర్లను మంగళవారం ప్రారంభించింది. ఈ గ్లోబల్ ట్రేడ్ ఫైనాన్స్ సెంటర్లను ఏర్పాటు చేయడంతో కొత్తగా 800 మంది ప్రతిభావంతులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. దేశీయ వాణిజ్యాన్ని, దిగుమతిఎగుమతి లావాదేవీల ప్రాసెసింగ్‌ను క్రమబద్ధీకరించడం, వేగవంతమైన టర్న్‌రౌండ్, గణనీయమైన కస్టమర్ అనుభవాన్ని అందించడానికి వీలు పడనున్నదని బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు.

# స్టార్‌లింక్‌కు దాదాపుగా అన్ని అనుమతులు





భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీసులను ప్రారంభించడంలో ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ దూకుడుగా వ్యవహరిస్తున్నది. ఇప్పటికే ఇందుకు కావాల్సిన అన్ని రెగ్యులేటరీ, లైసెన్సింగ్ అనుమతుల్ని స్పేస్‌ఎక్స్‌కు చెందిన స్టార్‌లింక్ అందుకోవడం గమనార్హం. దీంతో త్వరలోనే మెగా స్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం దేశీయ వినియోగదారులకు అందే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఇంకా కొన్ని టెక్నికల్, ప్రొసీజరల్ పనులు మిగిలే ఉన్నాయని దేశీయ స్పేస్ రెగ్యులేటర్ ఇన్‌స్పేస్ చైర్మన్ పవన్ గోయెంకా తెలిపారు. ఆథరైజేషన్ పూర్తయినా.. వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించాలనే కొద్ది నెలల సమయం పడుతుందని గోయెంకా చెప్తున్నారు. అయినప్పటికీ తుది ఆమోదం త్వరలోనే లభిస్తుందన్న సంకేతాలను ఇవ్వడం విశేషం. ఇక ఇప్పటికే స్టార్‌లింక్‌కు టెలికం శాఖ నుంచి లైసెన్స్ వచ్చింది. సెకనుకు 600700 గిగాబైట్ల స్పీడ్‌తో ఇంటర్నెట్‌ను స్టార్‌లింక్ అందించనున్నది. అయితే దీని ధరల్ని మాత్రం ఇంకా నిర్ణయించలేదు.




# ఆధార్ ఉంటేనే పాన్ కార్డు

పాన్ కార్డు జారీని ప్రభుత్వం మరింత కట్టుదిట్టం చేసింది. ఇక నుంచి ఎవరికైనా కొత్తగా పాన్ కార్డు కావాలంటే వారి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ కూడా సమర్పించాలి. ఈ నిబంధన మంగళవారం నుంచే అమల్లోకి వచ్చింది. ఇప్పటి వరకు ఎవరికైనా పాన్ కార్డు కావాలంటే వారి పేరు, పుట్టిన తేదీ గుర్తింపు పత్రాలు లేదా ఇతర ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాలు సమర్పిస్తే సరిపోయేది. పన్ను ఎగువేతలను మరింత పక్కాగా అడ్డుకునేందుకు ప్రభుత్వం ఈ తాజా చర్య తీసుకుంది.

# పీఎఫ్ ఉద్యోగులకు శుభవార్త తెలిపిన కేంద్ర ప్రభుత్వం..




అసలు డబ్బు మీ ఖాతాకు ఒకేసారి జమ అవుతుంది. అందుకే మీరు ఎక్కడైనా ఉద్యోగం చేస్తుంటే 202425 ఆర్థిక సంవత్సరానికి మీ 8.25% వడ్డీ ఇప్పటికే వచ్చి ఉండవచ్చు. లేదా త్వరలో వడ్డీ జమ కావచ్చని గుర్తించుకోండి. అయితే తాజాగా కేంద్రం ఉద్యోగులకు శుభవార్త తెలిపింది. ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ తెలిపింది. ఉద్యోగి ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ 202425 ఆర్థిక సంవత్సరానికి పీఎఫ్ లబ్ధిదారుల ఖాతాలలో 8.25 శాతం అదనపు వడ్డీని విడుదల చేయనుంది. వడ్డీని ప్రతి నెలా లెక్కించినప్పటికీ, ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి సాధారణంగా జూన్ ఆగస్టు మధ్య, అసలు డబ్బు మీ ఖాతాకు ఒకేసారి జమ అవుతుంది. అందుకే మీరు ఎక్కడైనా ఉద్యోగం చేస్తుంటే 202425 ఆర్థిక సంవత్సరానికి మీ 8.25% వడ్డీ ఇప్పటికే వచ్చి ఉండవచ్చు. లేదా త్వరలో వడ్డీ జమ కావచ్చని గుర్తించుకోండి.

**ఆన్‌లైన్‌లో మీ పీఎఫ్ ఖాతా బ్యాలెన్స్‌ను ఎలా తనిఖీ చేయాలి?**

1. అధికారిక ఈపీఎఫ్‌వో వెబ్‌సైట్‌కి వెళ్లండి: ఈపీఎఫ్‌వోఇండియా.జీఓవీ.ఇన్ అధికారిక సైట్‌ను మాత్రమే ఉపయోగించండి.
2. మై సర్వీస్ అనే విభాగంలోని ఎంప్లాయిస్ పై క్లిక్ చేయండి
3. సభ్యుల పాస్‌బుక్‌ని గుర్తించి దానిపై క్లిక్ చేయండి. తర్వాత మిమ్మల్ని లాగిన్ అవ్వాల్సిన కొత్త పేజీకి తీసుకెళుతుంది.
4. దీని కోసం మీ యూఏఎన్ (యూనివర్సల్ అకౌంట్ నంబర్) అవసరం. ఇది అన్ని పీఎఫ్ సభ్యులకు ఇచ్చిన ప్రత్యేక అకౌంట్ నంబర్. తర్వాత సెక్యూరిటీ కోసం క్యాప్చాను నమోదు చేయండి.
5. మీరు లాగిన్ అయిన తర్వాత మీ పీఎఫ్ ఖాతాల జాబితా కనిపిస్తుంది.
6. మీ పాస్‌బుక్ తెరుచుకుంటుంది. మీ అన్ని సహకారాలు (అంటే కంపెనీ నుంచి మీ నుంచి జమ అయిన వివరాలు కనిసిస్తాయి. ప్రతి ఆర్థిక సంవత్సరానికి జమ చేయబడిన వడ్డీ కనిపిస్తుంది.
7. 8.25% వడ్డీ జోడిరచబడిరదో లేదో చూడటానికి తాజా ఆర్థిక సంవత్సరం వడ్డీ జమ అయ్యిందో లేదో తెలుస్తుంది.
8. మీరు మీ రికార్డుల కోసం ఈ పాస్‌బుక్‌ను పీడీఎఫ్ కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన అంశాలు : ఎస్ఎంఎస్, మిస్డ్ కాల్ సేవలు పనిచేయడానికి మీ యూఏఎన్ యాక్టివేట్ చేయబడి మీ ఆధార్, పాన్, బ్యాంక్ ఖాతాకు లింక్ చేసి ఉండాలి. కొన్నిసార్లు అందరి పాస్‌బుక్‌లలో యాడ్ చేయడానికి సమయం పడుతుంది. అలాంటి సమయంలో టెన్షన్ పడాల్సిన అవసరం లేదు. త్వరలో అప్‌డేట్ అవుతుంది. మీరు నిరంతర సమస్యలు లేదా వ్యత్యాసాలను ఎదుర్కొంటుంటే మీరు ఈపీఎఫ్‌వో పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు లేదా మీ సమీప ఈపీఎఫ్‌వో కార్యాలయాన్ని సందర్శించవచ్చు.



# జూన్‌లో వాహన, ట్రాక్టర్ల విక్రయాల్లో మహీంద్రా బలమైన వృద్ధి..!

ప్రముఖ వాహన తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా, జూన్ 2025లో తమ మొత్తం వాహన విక్రయాల్లో గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. ట్రాక్టర్ల అమ్మకాల్లోనూ కంపెనీ అద్భుతమైన పనితీరు కనబరిచింది. మొత్తం మీద ఆటోమొబైల్, వ్యవసాయ పరికరాల విభాగాల్లో బలమైన వృద్ధిని సాధించినట్లు సంస్థ వెల్లడిరచింది.


ఆటోమొబైల్ విభాగంలో 14 శాతం వృద్ధి

మహీంద్రా అండ్ మహీంద్రా జూన్ 2025లో మొత్తం 78,969 వాహనాలను విక్రయించింది. ఇది గతేడాదితో పోలిస్తే 14 శాతం వృద్ధిని సూచిస్తుంది. ఇందులో ఎగుమతులు కూడా కలిసి ఉన్నాయి. ఈ వృద్ధికి ప్రధాన కారణం యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీ) విభాగం. దేశీయ మార్కెట్‌లో ఎస్‌యూవీ విక్రయాలు 18 శాతం పెరిగి 47,306 యూనిట్లకు చేరాయి. ఈ త్రైమాసికం ఎస్‌యూవీలకు సంబంధించి అత్యధిక విక్రయాలు నమోదైన త్రైమాసికం అని కంపెనీ ఆటోమోటివ్ విభాగం సీఈఓ నళినీకాంత్ తెలిపారు. వాణిజ్య వాహనాల దేశీయ విక్రయాలు 20,575 యూనిట్లుగా నమోదయ్యాయి. 3 చక్రాల వాహనాల (ఎలక్ట్రిక్ 3వీలతో సహా) విక్రయాలు 37 శాతం పెరిగి 8,454 యూనిట్లకు చేరాయి. మొత్తం ఎగుమతులు గత ఏడాదితో పోలిస్తే 1 శాతం పెరిగి 2,634 యూనిట్లుగా నమోదయ్యాయి.

వ్యవసాయ పరికరాల వ్యాపారంలో 13 శాతం...

మహీంద్రా వ్యవసాయ పరికరాల వ్యాపారం జూన్ 2025లో దేశీయ ట్రాక్టర్ల విక్రయాల్లో 13 శాతం వృద్ధిని సాధించింది. మొత్తం 51,769 ట్రాక్టర్లను విక్రయించినట్లు కంపెనీ తెలిపింది. జూన్ 2024లో ఇదే సంఖ్య 45,888 యూనిట్లుగా ఉంది. ఎగుమతులతో సహా మొత్తం ట్రాక్టర్ల విక్రయాలు 53,392 యూనిట్లుగా నమోదయ్యాయి. ఇది గతేడాది 47,319 యూనిట్ల కన్నా 13 శాతం అధికం. ఎగుమతులు సైతం 13 శాతం పెరిగి 1,623 యూనిట్లకు చేరాయి. మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ బిజినెస్ ప్రెసిడెంట్ విజయ్ నక్రా మాట్లాడుతూ.. రబీ పంట కోతల నుండి లభించిన నగదు, రుతుపవనాల విస్తృత విస్తరణ కారణంగా జూన్‌లో పరిశ్రమ వృద్ధి సాధించిందని పేర్కొన్నారు.

# హెచ్‌పీవీ 9 వ్యాక్సిన్ తయారీలోకి బీఈ




చైనా కంపెనీ రెక్‌బయోతో భాగస్వామ్య ఒప్పందం

ప్రజలను హ్యూమన్ పాపిలోమా వైరస్ నుంచి కాపాడేందుకు హెచ్‌పీవీ 9 వ్యాక్సిన్ తయారీ కోసం చైనా బయోఫార్మాస్యూటికల్ కంపెనీ రెక్‌బయో టెక్నాలజీతో హైదరాబాద్ కేంద్రం గా ఉన్న బయోలాజిక్‌ఈ (బీఈ) భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు బీఈతో లైసెన్సింగ్ సహకార ఒప్పందం కుదిరినట్టు జియాంగ్సు రెక్‌బయో టెక్నాలజీ కంపెనీ వెల్లడిరచింది. ఈ ఒప్పందానికి అనుగుణంగా బీఈకి తాము రీ కాంబినెంట్ 9వాలెంట్ హెచ్‌పీవీ (హెచ్‌పీవీ 9) వ్యాక్సిన్ టెక్నాలజీ బదిలీని ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపింది. అలాగే ఆ వ్యాక్సిన్ తయారీకి అవసరమైన ముడి పదార్థాన్ని (డీఎస్) కూడా రెక్‌బయో అందిస్తుంది. టెక్నాలజీ బదిలీ పూర్తి కాగానే భారీ పరిమాణంలో హెచ్‌పీవీ9 వ్యాక్సిన్ తయారీని బీఈ ప్రారంభిస్తుంది. వ్యాక్సిన్‌కు సంబంధించిన క్లినికల్ డెవల్‌పమెంట్, రెగ్యులేటరీ అనుమతుల విషయంలో బీఈకి అవసరమైన మద్దతును అందించనున్నట్టు రెక్‌బయో తెలిపింది. ఇదిలా ఉండగా ఆ వ్యాక్సిన్ తమ ప్లాంట్‌లో తయారుచేసి, దేశం లో వాణిజ్యపరంగా విడుదల చేయడంతో పాటు యునిసెఫ్, పీఏహెచ్‌ఓ టెండర్లలో పాల్గొనే అవకాశం బీఈకి ఈ ఒప్పందం ద్వారా లభిస్తుంది. సర్వైకల్, వుల్వా, వెజైనల్, ఆనల్, ఓరోఫరింజియల్ క్యాన్సర్లు సహా 9 రకాల క్యాన్సర్లకు కారణమయ్యే హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) చికిత్స కోసం జెనెటిక్ ఇంజనీరింగ్ టెక్నిక్‌లను ఉపయోగించి తయారుచేసే (రీకాంబినెంట్) వ్యాక్సిన్ ఇది. 945 సంవత్సరాల మధ్య వయస్కుల్లో వినియోగించే మరో కీలక ఉత్పత్తి ఆర్‌ఈసీ 603పై ప్రస్తుతం చైనాలో మూడో దశ క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక






# హిమాచల్‌లో జల విలయం

- హిమాచల్ ప్రదేశ్‌ను ముంచెత్తుతున్న భారీ వర్షా లు, వరదలు
- జూన్ 20 నుంచి ఇప్పటివరకు ప్రాణాలు కోల్పోయిన 51 మంది
- వరద సంబంధిత ఘటనల్లో మరో 22 మంది గల్లంతు
- ఉగ్రరూపం దాల్చిన బియాస్ నది, పలు జిల్లాల్లో రెడ్ అలర్ట్

హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో అతలాకుతలమవుతోంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న కుండపోత వానలకు జనజీవనం స్తంభించిపోయింది. ప్రకృతి సృష్టిస్తున్న ఈ బీభత్సానికి ఇప్పటివరకు 51 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 22 మంది గల్లంతయ్యారని అధికారులు అధికారికంగా ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ఈ విపత్తుపై ఒక నివేదికను విడుదల చేసింది. జూన్ 20 నుంచి జూలై 2వ తేదీ వరకు జరిగిన నష్టాన్ని ఈ నివేదికలో పొందుపరిచింది. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, పిడుగులు పడటం వంటి వర్ష సంబంధిత ప్రమాదాల కారణంగా రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ఈ మరణాలు సంభవించాయని తెలిపింది. ఈ ఘటనల్లో సుమారు 103 మంది గాయపడినట్లు నివేదిక వెల్లడించింది. అత్యధికంగా మండీ జిల్లాలో 10 మంది చనిపోయారని తెలిపింది. భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని ప్రధాన నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా మండీ జిల్లాలో బియాస్ నది ఉప్పొంగి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో అనేక లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. చండీగఢ్‌మనాలీ జాతీయ రహదారిపై పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిరది. ముందుజాగ్రత్త చర్యగా మండీ, సిర్మౌర్ జిల్లాల్లో సుమారు 250కి పైగా రహదారులను అధికారులు మూసివేశారు. పలు జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. వరదల కారణంగా 614 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 130 మంచినీటి సరఫరా పథకాలు దెబ్బతిన్నాయని, దీంతో విద్యుత్, నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడిరదని అధికారులు తెలిపారు. సహాయక బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు ముమ్మరం చేశాయి.



## మైనర్ విద్యార్థిపై మహిళా టీచర్ లైంగిక వేధింపులు

- స్కూలు వదిలినా వేధింపులు ఆపని ఉపాధ్యాయురాలు
- ఆందోళనకు లోనైన బాధితుడికి సొంత వైద్యం చేసిన టీచర్

దేశ ఆర్థిక రాజధానిలో ఓ మహిళా ఉపాధ్యాయురాలు మైనర్ విద్యార్థిపై లైంగిక వేధింపులకు పాల్పడిరది. నలభై ఏళ్ల వయసున్న ఆ టీచర్ పదహారేళ్ల బాలుడిపై ఈ అమానుషానికి పాల్పడిరది. బాలుడి స్నేహితురాలితో రాయబారం నడిపి, తనతో సన్నిహితంగా మెలిగేలా ప్రోత్సహించింది. ఈ ఘటన తర్వాత బాలుడు యాంగ్జైటీతో బాధపడగా.. ఉపాధ్యాయురాలు తనకొచ్చిన సొంత వైద్యం చేసింది. యాంగ్జైటీ తగ్గేందుకు టాబ్లెట్లు ఇచ్చింది. బాలుడి ప్రవర్తనలో మార్పు గమనించి కుటుంబ సభ్యులు నిలదీయడంతో టీచర్ నిర్వాకాన్ని బాలుడు బయటపెట్టాడు. అయితే, కొన్ని రోజులు గడిస్తే చదువు పూర్తవుతుంది, టీచర్ వేధింపులు తప్పుతాయని ఆలోచనతో బాలుడి తల్లిదండ్రులు విషయాన్ని బయటపెట్టలేదు. స్టడీ పూర్తిచేసుకుని ఆ స్కూలు నుంచి బయటకు వచ్చేసినా ఆ టీచర్ వేధింపులు ఆగకపోవడం, ఇంట్లో పనిమనిషితో రాయబారం పంపడంతో బాధితుడి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఆ టీచర్ కు వివాహం జరిగిందని, పిల్లలు కూడా ఉన్నారని బాలుడి పేరెంట్స్ చెప్పారు. వారి ఫిర్యాదుతో పోలీసులు సదరు టీచర్ పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాధితుడు పదకొండో తరగతి చదువుతున్నప్పటి నుంచే ఉపాధ్యాయురాలి వేధింపులు మొదలయ్యాయని పోలీసులు తెలిపారు. అప్పటి నుంచే బాలుడితో అసభ్యకరంగా ప్రవర్తించేదని, పలు సందర్భాల్లో లైంగిక సంబంధం కోసం సైగలు చేసిందని వివరించారు. 12వ తరగతిలోకి వచ్చాక బాలుడు తనను దూరం పెడుతుండడంతో ఉపాధ్యాయురాలు మరో పన్నాగం పన్నిందన్నారు. తనతో సన్నిహితంగా మెలగాలని బాలుడి స్నేహితురాలితో చెప్పించిందని తెలిపారు. పెద్ద వయసు మహిళలతో బాలుర రిలేషన్ షిప్ ఇటీవలి కాలంలో సాధారణంగా మారిందని, మీరిద్దరూ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అని బాలుడి స్నేహితురాలు ప్రోత్సహించింది. దీంతో బాలుడు కూడా టీచర్ కు దగ్గరయ్యాడని వివరించారు. ఈ ఘటనకు సంబంధించి టీచర్ తో పాటు ఆమెకు సహకరించిన బాలుడి స్నేహితురాలిపైనా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

## ఆకస్మిక మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్లు కారణం కాదు

- ఆందోళన కలిగిస్తున్న ఆకస్మిక మరణాలు
- ఆకస్మిక మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్లతో ఎలాంటి సంబంధం లేదు
- కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం




దేశంలో ఇటీవలే ఆకస్మిక మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. చిన్న పిల్లల నుంచి యుక్త వయసువారు, వృద్ధులు ఇలా వయసుతో సంబంధం లేకుండా అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోతున్నారు. డ్యాన్స్ చేస్తూ, ఆటలు ఆడుతూ ఇలా అప్పటి వరకూ బాగానే ఉన్న వాళ్లు.. ఒక్కసారిగా కళ్లముందే కుప్పకూలి ప్రాణాలు వదులుతున్నారు. ఎక్కువగా గుండెపోటుతోనే మరణాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా కొవిడ్ అనంతరం ఈ మరణాలు అధికమయ్యాయి. దీంతో కొవిడ్ వ్యాక్సిన్ల వల్లే ఈ మరణాలు సంభవిస్తున్నాయంటూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుమానాలపై కేంద్రం తాజాగా స్పష్టతనిచ్చింది. ఆకస్మిక మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్లతో ఎలాంటి సంబంధం లేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలే కారణమంటూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్), ఢల్లీ ఎయిమ్స్ సంయుక్తంగా లోతైన అధ్యయనాన్ని చేపట్టాయి. ఈ పరిశోధనలో భాగంగా కొవిడ్ నుంచి కోలుకున్న తర్వాత మరణించిన పలు కేసులను శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా విశ్లేషించారు. వారి ఆరోగ్య నేపథ్యం, వ్యాక్సినేషన్ వివరాలు, ఇతర వైద్య సంబంధిత అంశాలను పరిశీలించారు. ఈ అధ్యయనంలో ఆకస్మిక మరణాలకు ప్రధాన కారణం బాధితులకు ముందు నుంచే ఉన్న అనారోగ్య సమస్యలే అని తేలింది. దాదాపు నెలరోజులపాటూ జరిపిన ఈ అధ్యయనంలో జన్యుపరమైన లోపాలు, తీవ్రమైన అనారోగ్య సమస్యలే కారణమని నిర్ధరణ అయ్యింది. వ్యాక్సిన్ల వల్ల కలిగే దుష్ప్రభావాల కారణంగా ఈ మరణాలు సంభవిస్తున్నాయనడానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లభించలేదని నివేదిక పేర్కొంది.

## 8 రోజులు, 5 దేశాలు..

- దశాబ్దంలోనే సుదీర్ఘ విదేశీ పర్యటనకు ప్రధాని మోడీ

భారత ప్రధాని నరేంద్ర మోడీ నేటి నుంచి ఎనిమిది రోజుల పాటు ఐదు దేశాల సుదీర్ఘ పర్యటనకు బయలుదేరనున్నారు. గత దశాబ్ద కాలంలో మోడీ చేస్తున్న అత్యంత సుదీర్ఘమైన విదేశీ పర్యటన ఇది. ఈ పర్యటనలో ఆయన ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాలను సందర్శించనున్నారు. ముఖ్యంగా బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడం ఈ పర్యటనలోని ప్రధాన ఉద్దేశ్యం. గ్లోబల్ సౌత్ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడం, వాణిజ్యం, రక్షణ, శక్తి రంగాల్లో సహకారాన్ని పెంపొందించడంపై ప్రధాని మోడీ దృష్టి సారించనున్నారు. అలాగే, ప్రధానమంత్రి బ్రెజిల్‌లో జరిగే కీలకమైన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలోనూ పాల్గొంటారు. ప్రధాని మోదీ చివరి ఎనిమిది రోజుల పర్యటన జులై 2015లో ఆరు దేశాల పర్యటనకు వెళ్లారు. ఆ సమయంలో ప్రధాని మోడీ రష్యాతోపాటు ఐదు మధ్య ఆసియా దేశాలను సందర్శించారు. ఈ పర్యటన రక్షణ, అరుదైన భూమి ఖనిజాలు, ఉగ్రవాద నిరోధక చర్యలపై సహకారం వంటి అంశాలపై దృష్టి సారిస్తుందని అధికారులు తెలిపారు.



## పార్లమెంటులో భద్రతా వైఫల్యం కేసులో నిందితులకు బెయిల్



పార్లమెంటులో భద్రతా వైఫల్యం కేసులో 2023 డిసెంబర్‌లో నిందితులుగా ఉన్న నీలమ్ ఆజాద్, మహేష్‌కుమావత్‌లకు ఢల్లీహైకోర్టు బుధవారంనాడు బెయిలు మంజూరు చేసింది. నిందితులు రూ.50,000 చొప్పున బెయిల్ బాండ్, పూచీకత్తులను సమర్పించాలని జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్, హరీష్ వైద్యనాథన్ శంకర్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. బెయిల్ ఆర్డర్‌లో కఠినమైన షరతులు విధించింది. నిందితులు మీడియా సమావేశాల్లో పాల్గొనరాదని, ఇంటర్వ్యూలు ఇవ్వరాదని, ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో పోస్టింగులు పెట్టరాదని ఆదేశించింది. ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో ఉదయం 10 గంటలకు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేయాలని, ఢల్లీవిడిచిపెట్టి వెళ్లరాదని ఆదేశాలిచ్చింది.
నిందితులపై తగినన్ని సాక్ష్యాధారాలు ఉన్నందున బెయిల్ ఇవ్వరాదని ఢల్లీపోలీసులు విచారణ సందర్భంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. విశ్వసనీయ పత్రాలు, మెటీరియల్ ఉన్నందున 1967 చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద శిక్షార్హులని కోర్టుకు విన్నవించారు. 2023 పార్లమెంటు శీతాకాల సమవేశాల వేళ లోక్‌సభలో జీరో అవర్ జరుగుతుండగా పబ్లిక్ గ్యాలరీ నుంచి సాగర్ శర్మ, మనోరంజన్ అనే ఇద్దరు సభలోకి దూకి గందరగోళం సృష్టించారు. పసుపు రంగుతో కూడిన పొగ విడుదల చేయడంతో ఎంపీలు భయభ్రాంతులకు గురయ్యారు. ఇదే సమయంలో అమోల్ శిందే, నీలమ్‌లు పార్లమెంటు వెలుపల కలర్ గ్యాస్ వదులుతూ నియంతృత్వం పనిచేయదంటూ నినాదాలు చేశారు. అనంతరం భద్రతా సిబ్బంది ఈ నలుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటన సంచలనం సృష్టించడంతో పార్లమెంటు సమగ్ర భద్రతా బాధ్యతలను సీఐఎస్ఎఫ్‌కు కేంద్రం అప్పగించింది.

## డిగ్రీ అర్హతతో భారీగా ఐబీపీఎస్ బ్యాంకు ఉద్యోగాల నోటిఫికేషన్




ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్ (ఐబీపీఎస్).. 2026 - 27 సంవత్సరానికి ప్రొబేషనరీ ఆఫీసర్స్, మేనేజ్‌మెంట్ ట్రైనీ ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 5,208 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించి ఉంటే చాలు.. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో జులై 1వ తేదీ నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలు ఈ కింద చెక్ చేసుకోవచ్చు.. ఐబీపీఎస్ ప్రొబేషన్‌రీ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు జూలై 21, 2025 నాటికి ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. అభ్యర్థుల వయో పరిమితి 2025 జులై 1వ తేదీ నాటికి 20 నుంచి 30 ఏళ్లు మధ్య ఉండాలి. అంటే జులై 2, 1995 నుంచి జులై 1, 2005 మధ్య జన్మించినవారు మాత్రమే అర్హులన్నమాట. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 5 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 3 ఏళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 10 ఏళ్లు, ఈఎస్ఎం అభ్యర్థులకు 5 ఏళ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ఈ అర్హతలు కలిగిన అభ్యర్థులు జులై 21, 2025వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. దరఖాస్తు ఫీజు కింద జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.850, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు రూ.175 తప్పనిసరిగా చెల్లించవల్సి ఉంటుంది. ప్రిలిమినరీ, మెయిన్స్, వ్యక్తిత్వ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఫైనల్ సెలెక్షన్‌లో మెయిన్స్ (80 శాతం), ఇంటర్వ్యూకు (20 శాతం) మార్కులు ఉంటాయి. ఎంపికైన వారికి నెలకు రూ.48,480 నుంచి రూ.85,920వరకు జీతంతోపాటు ఇతర అలవెన్సులు అందిస్తారు.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






## ప్రస్తుతం ఆ షాట్ ప్రపంచవ్యాప్తంగా ఓ సంచలనం...

**దేశ రాజధానిలో పెద్ది హంగామా...**

కేవలం ఒక్క గ్లింప్స్‌తో 'పెద్ది' సినిమా గురించి ప్రపంచం మాట్లాడుకునేలా చేశారు దర్శకుడు బుచ్చిబాబు సానా. రెండు చేతులతో రామ్‌చరణ్ క్రికెట్ బ్యాట్ హ్యాండిల్‌ని బలంగా పట్టుకొని, ఫ్రంట్ కొచ్చి.. దాన్ని నేలపై గుద్ది మరీ బంతిని బాదిన షాట్ ఏదైతే ఉందో.. ప్రస్తుతం ఆ షాట్ ప్రపంచవ్యాప్తంగా ఓ సంచలనం. కొందరైతే ఆ షాట్‌ని అనుకరిస్తూ ఇన్‌స్టాలో రీల్స్ కూడా చేస్తున్నారు. 'పెద్ది' గ్లింప్స్ దెబ్బ అలా ఉందన్నమాట. ప్రస్తుతం ఈ పాన్ ఇండియా సినిమాకోసం సినీప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. క్రీడా నేపథ్యంలో సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో రామ్‌చరణ్ ఊరమాస్ అవతారంలో ప్రేక్షకుల్ని థ్రిల్ చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమా చాలావరకూ చిత్రీకరణ పూర్తి చేసుకున్నది. నెక్స్ట్ షెడ్యూల్‌ని ఈ నెల 12 నుంచి మేకర్స్ మొదలుపెట్టబోతున్నారు. ఢిల్లీలో జరిగే ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారట. ఈ షెడ్యూల్‌లోనే రామ్‌చరణ్, జాన్వీకపూర్‌లపై కొన్ని రొమాంటిక్ సీన్స్ కూడా తీస్తారని సమాచారం. పనిలో పనిగా ఒకట్రెండు పాటల్ని కూడా షూట్ చేస్తారట. ఈ సినిమాకు ఇంకా 40రోజుల షూటింగ్ మాత్రమే బ్యాలెన్స్ ఉంది. ఆగస్ట్ వరకూ జరిగే ఈ షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుందని, త్వరలో పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభిస్తామని మేకర్స్ చెబుతున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ పాన్ ఇండియా సినిమా విడుదల కానుంది. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందుశర్మ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్.రత్నవేలు, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, ఎడిటింగ్: నవీన్ నూలి, నిర్మాత: వెంకటసతీష్ కిలారు, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాణం: వృద్ధి సినిమాస్.

# మహిళలంతా గర్వపడేలా మా పాత్రలు : సప్తమి గౌడ

నితిన్ హీరోగా శ్రీరామ్‌వేణు దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మించిన చిత్రం 'తమ్ముడు'. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రధారులు. ఈ నెల 4న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్స్‌ని వేగవంతం చేశారు. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో చిత్ర యూనిట్ అంతా సందడి చేశారు. ఈ ఈవెంట్‌లోనే థియేట్రికల్ ట్రైలర్‌ని కూడా లాంచ్ చేశారు. ఇదిలావుంటే.. మంగళవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర కథానాయికల్లో ఒకరైన సప్తమి గౌడ విలేకరులతో ముచ్చటించారు. 'కాంతార' తర్వాత దర్శకుడు శ్రీరామ్‌వేణు నుంచి 'తమ్ముడు' మూవీ కోసం కాల్ వచ్చిందని, హైదరాబాద్ వచ్చి లుక్ టెస్ట్‌లో ఓకే అయ్యాక కథ, డైలాగ్ వెర్షన్ చెప్పారని సప్తమీ గౌడ తెలిపారు. ఇంకా ఆమె మాట్లాడుతూ 'ఇందులో మా ఊరి పేరు అంబరగొడుగు. నా పేరు రత్న. పవన్‌కల్యాణ్ అభిమానిని. సీరియస్ సబ్జెక్ట్ అయిన 'తమ్ముడు' సినిమాలో నా పాత్ర వల్ల ఫన్ క్రియేట్ అవుతుంది. లయ, నితిన్ కొన్ని పరిస్థితుల కారణంగా మా ఊరు వస్తారు. వారి ప్రయాణంలో నా పాత్ర ఎలా భాగమైంది అనేది ఇందులో ఆసక్తికరమైన అంశం.' అని సప్తమి గౌడ చెప్పారు. 'లయ మేడమ్, దిత్య, వర్ష, స్వసిక, నేను.. మా అయిదుగురి పాత్రలు పవర్‌ఫుల్‌గా ఉంటాయి. మాకు ఫైట్ సీక్వెన్స్ కూడా ఉన్నాయి. మహిళలంతా గర్వపడేలా మా పాత్రల్ని మలిచారు దర్శకుడు శ్రీరామ్‌వేణు. ఇందులో నితిన్‌తో నాకు మంచి లవ్‌ట్రాక్ ఉంది. మా ఇద్దరి పాత్రలు కలవాలని ప్రేక్షకులు కూడా కోరుకుంటారు' అని సప్తమి గౌడ చెప్పింది.







## దీక్ష పేరు తీసుకొచ్చే చిత్రమవుతుంది : ఆర్.కె.గౌడ్

స్వీయ నిర్మాణ దర్శకత్వంలో ప్రతాని రామకృష్ణగౌడ్ రూపొందించిన చిత్రం 'దీక్ష'. కిరణ్, అలేఖ్య రెడ్డి జంటగా నటించారు. ఈ చిత్రాన్ని ఈ నెలాఖరున విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్.కె.గౌడ్ మాట్లాడుతూ... దీక్ష, పట్టుదలతో పనిచేస్తే ఎంతటి కార్యాన్నైనా సాధించవొచ్చనే సందేశాత్మక కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ఇప్పటికే విడుదలైన ఐదు పాటలకు మంచి స్పందన లభిస్తున్నదని, తమ సంస్థకు గొప్ప పేరు తీసుకొచ్చే చిత్రమవుతుందని చెప్పారు. నేటి యువతరంలో స్ఫూర్తినింపే సినిమా ఇదని హీరో కిరణ్ పేర్కొన్నారు. ఆర్.కె.ఫిల్మ్స్, సిగ్ధ క్రియేషన్స్ పతాకాలపై ఆర్.కె.గౌడ్, అశోక్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు.



# నిన్న కన్నప్ప... నేడు జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ

సురేశ్ గోపీ కీలక పాత్ర పోషించిన జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంపై మలయాళ చిత్రసీమ నిరసన వ్యక్తం చేసింది. కేరళలోని నటీనటులు, సాంకేతిక నిపుణులు సి.బి.ఎఫ్.సి. ఆఫీస్ ముందు ధర్నా చేశారు. కేంద్ర మంత్రి సురేశ్ గోపీ నటించిన 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' చిత్రానికి, సెన్సార్ బోర్డ్‌కు మధ్య వివాదం చినికి చినికి గాలివానగా మారుతోంది. కొన్ని నిజ సంఘటనల ఆధారంగా 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' సినిమాను తీసినట్టు ఆ చిత్ర దర్శకుడు ప్రవీణ్ నారాయణ్ తెలిపారు. ఈ కోర్ట్ రూమ్ థ్రిల్లర్ మూవీలో జానకి పాత్రను అనుపమా పరమేశ్వరన్ పోషించారు. 'నిజం ఎప్పటికైనా విజయం సాధిస్తుంది' అనేది ట్యాగ్ లైన్. ఇందులో నాయిక పేరును జానకిగా పెట్టడంపై సెన్సార్ బోర్డ్ అభ్యంతరం వ్యక్తం చేసిందట. సీతాదేవిని జానకి అని కూడా సంబోధిస్తారని, దాడికి గురైన ఓ మహిళకు ఆ పేరు ఎలా పెడతారని సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించిందట. కానీ సెన్సార్ వాళ్ళు చెప్పిన వాటికి అంగీకరిస్తే... సినిమాలో చాలా సన్నివేశాలలో డైలాగ్స్ మార్చాల్సి వస్తుందని, అది ఖర్చుతో కూడుకున్నదే కాకుండా సమయాన్ని కూడా హరించేదని మేకర్స్ వాపోతున్నారు.

**అసలు అభ్యంతరం సెంట్రల్ ఆఫీస్ నుండి..!**


ఏ భాషా చిత్రాలను ఆయా ప్రాంతాలలో సెన్సార్ చేయడమనేది ఎప్పటి నుంచో ఉంది. అయితే చాలా సందర్భాలలో స్థానిక చిత్రాలను అక్కడి ఆచార వ్యవహారాలను దృష్టిలో పెట్టుకుని సెన్సార్ సభ్యులు సెన్సార్ చేస్తుంటారు. ఆ రకంగా కొన్ని సినిమాలలోని సంభాషణలను, సన్నివేశాలను ఉదారంగా చూసి, చూడనట్టు వదిలివేయడం జరుగుతూ ఉండేది. కానీ ఇప్పుడు పాన్ ఇండియా కల్చర్ అనేది ఒకటి మొదలైంది. ప్రాంతీయ చిత్రాలను నాలుగైదు భాషల్లో డబ్ చేసి ఒకేసారి విడుదల చేస్తున్నారు. ఇదే ఇప్పుడు పలు చిత్రాలను ఇబ్బందులకు గురిచేస్తోందని తెలుస్తోంది. దక్షిణాది ఆచార వ్యవహారాలకు ఉత్తరాది వాటికి కొంత తేడా ఉంటుంది. అలానే ఇక్కడ దేవీ దేవతల ఆరాధనకు ఉత్తరాది వారి ఆరాధన విధానానికి వ్యత్యాసం ఉంటుంది. దాంతో ఇక్కడ అభ్యంతరకరంగా అనిపించనిది... ఉత్తరాది వారికి అభ్యంతరకరం కావచ్చు. ఈ కారణంగానే గత కొంతకాలంగా సినిమాలను సెన్సార్ చేసే సమయంలో కేవలం ప్రాంతీయ భాషను, ఆచార వ్యవహారాలను దృష్టిలో పెట్టుకుని కాకుండా మొత్తం భారతీయ ఆచార వ్యవహారాలను దృష్టిలో పెట్టుకుని సెన్సార్ చేయమని కోరుతున్నారట. 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' విషయంలో అదే జరిగిందని సమాచారం. జూన్ 27న ఈ సినిమా విడుదల కావాల్సి ఉండగా, 22న కేరళలోని సెన్సార్ ప్రాంతీయ కార్యాలయం అధికారులు దీన్ని చూసి యు/ఎ సర్టిఫికెట్ ఇవ్వడానికి అంగీకారం తెలిపారట. దాంతో మేకర్స్ హ్యాపీ ఫీలయ్యారు. కానీ 'జానకి' అనే పేరును దాడికి గురైన మహిళకు పెట్టడానికి కేరళ వారికి అభ్యంతరం ఉండకపోవచ్చు... బట్ ఉత్తరాది ప్రేక్షకుల మనోభావాలను ఇది దెబ్బ తీయవచ్చునని ముంబైలోని సెంట్రల్ సెన్సార్ బోర్డ్ సభ్యులు భావించారట. దాంతో ఆ మర్నాడే సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకుండా ముందు టైటిల్ మార్చడంతో పాటు సినిమాలో జానకి పేరును తొలగించమని సూచన చేశారట. ఇలా ఇరవై నాలుగు గంటలు తిరగక ముందే సెన్సార్ బృందం ఇలా యూటర్న్ తీసుకోవడంపై మేకర్స్ ఆగ్రహంతో ఊగిపోయారు. ఇందులో హీరోయిన్ పేరు జానకి కాగా ఆమె రిలేషన్‌లో ఉండే వ్యక్తి పేరు అబ్రహం అని, వీరిద్దరికి సంబంధించిన సున్నితమైన అంశాలు కలిగిన కథ కావడంతో జానకి పేరును తొలగించాల్సిందేనని ముంబై అధికారులు పట్టుపడుతున్నారట. పర్యవసానంగా సోమవారం మలయాళ సినిమా రంగానికి చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు కేరళలోని సెన్సార్ ఆఫీస్ ముందు నిరసన వ్యక్తం చేశారు.



సరిగ్గా వారం క్రితం తెలుగు సినిమా 'కన్నప్ప' విషయంలోనూ అదే జరిగినట్టు తెలుస్తోంది. 'కన్నప్ప' సినిమాకు ప్రాంతీయ సెన్సార్ బోర్డ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా... ఇది డివోషనల్ మూవీ కావడంతో ముంబై కార్యాలయం అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. దాంతో 'కన్నప్ప'ను రివైజింగ్ కమిటీకి పంపి అక్కడ నుండి మేకర్స్ సర్టిఫికెట్ పొందారట. మొత్తం మీద పాన్ ఇండియా అనేది దర్శక నిర్మాతలను, సెన్సార్ అధికారులను కూడా ఇప్పుడు బాగా ఇబ్బంది పెడుతున్నట్టు తెలుస్తోంది. మరి నటుడు, కేంద్ర మంత్రి సురేశ్ గోపీ ఈ సమస్యను పట్టించుకుని దీనికేమైనా పరిష్కారం ఆలోచిస్తారేమో చూడాలి.

## ప్రపంచానికి ఇచ్చే బహుమతి 'రామాయణ' చిత్రం

బాలీవుడ్ అగ్ర నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ 'రామాయణ' చిత్రం తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పేరు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. షూటింగ్ చాలావరకే పూర్తయినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు సంబంధించి అధికారి ప్రకటించిన రోజు నుంచి ఏ వార్త వచ్చినా వైరల్ అవుతోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ భారీ ఈవెంట్‌ను జులై 3న ఏర్పాటు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. అందులో టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ఈవెంట్‌కు టీమ్ మొత్తం హాజరుకానున్నారు. బెంగళూర్‌లో జరగనున్న ఈ కార్యక్రమం కోసం తారలంతా అక్కడికి బయల్దేరుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రెండు భాగాలుగా ఈ చిత్రం తెరకెక్కుతున్న ఈ చిత్రం మొదటి పార్ట్ షూటింగ్ కంప్లీట్ అయినట్లు తెలుస్తోంది. ఆ వీడియోలు కూడా నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోల్లో టీమ్ అందరికీ రణ్‌బీర్ కపూర్, నితేశ్ తివారీలు ధన్యవాదాలు చెబుతూ కనిపిస్తున్నారు. ఈ సినిమా మొదటి భాగాన్ని 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ దేవోల్ నటిస్తున్నారు. నిర్మాత నమిత్ మల్హోత్ర మాట్లాడుతూ "ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులందరికీ ఒక సాంస్కృతిక సమ్మేళనమైన కథ. రామాయణంతో మేం చరిత్రను చెప్పడం లేదు. ఆ చరిత్రకున్న లెగసీని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాము. ఈ కథ, దానిలోని భావోద్వేగాలను, ఇప్పటి టెక్నాలజీతో ప్రపంచానికి చెప్పబోతున్నాం. రామాయణాన్ని ఇంతకు ముందు కూడా సినిమాలుగా చూశాం. కానీ లేటెస్ట్ వెర్షన్‌లో ప్రకృతి దృశ్యాలు, జీవులు, యుద్ధాలు మరింత గొప్పగా చూపించబోతున్నాం. భారతీయులుగా ఇది రామాయణ ఇతిహాసం నిజం. ఇప్పుడు అది ప్రపంచానికి మనమిచ్చే బహుమతి అవుతుంది" అని అన్నారు. దర్శకుడు నితేష్ తివారీ మాట్లాడుతూ "రామాయణం అనేది మనందరికీ తెలిసిన కథ. ఇది మన సంస్కృతి యొక్క విశిష్టతను చెబుతుంది. ఆ సంప్రదాయాన్ని గౌరవించడం మన కర్తవ్యం. ఆ ఇతిహాసం పేరును ఎక్కడా చెడగొట్టకుండా సినిమాటిక్ స్కేల్‌తో దానిని తెరపై ప్రదర్శించడం మా లక్ష్యం. ఈ తరహా కథకు జీవం పోయడం పెద్ద బాధ్యత. ఇది వేల సంవత్సరాలుగా ఉన్న కథ. మేము కేవలం సినిమా తీయడం లేదు. ఓ భక్తి వాతావరణాన్ని సృష్టించబోతున్నాం" అని అన్నారు.



గురువారం-03- జూలై 2025

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వింబుల్డన్‌లో సీడెడ్ ప్లేయర్లకు చుక్కెదురు

**పెగులా జ్వెరెవ్‌కు షాక్... సినర్, స్వియటెక్, క్రెజికొవా ముందుకు**

వింబుల్డన్‌లో రెండో రోజు సీడెడ్ ప్లేయర్లకు చుక్కెదురైంది. పురుషుల, మహిళల విభాగాల్లో మూడో సీడ్ క్రీడాకారులు అలెగ్జాండర్ జ్వెరెవ్, జెస్సికా పెగు లా, ఐదో సీడ్ క్విన్‌వెన్ జాంగ్‌లకు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. అయితే, టాప్ సీడ్ జానిక్ సినర్, డిఫెండిరగ్ చాంప్ బార్బరా క్రెజికొవా, స్వియటెక్ అలవోకగా రెండో రౌండ్‌కు చేరుకొన్నారు. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో పెగులా (అమెరికా) 26, 36తో ఎలిజబెత్ కికియారిటో (ఇటలీ) చేతిలో, చైనా ప్లేయర్ క్విన్‌వెన్ జాంగ్ 57, 64, 16తో సినియకొవా (చెక్) చేతిలో, 15వ సీడ్ ముచోవా 57, 26తో వాంట్ (చైనా) చేతిలో పరాజయం పాలయ్యారు. కాగా, 8వ సీడ్ స్వియటెక్ 75, 61తో కుదెర్మెటోవాపై, 17వ సీడ్ క్రెజికొవా 36, 62, 61 అలెగ్జాండ్రా (ఫిలిప్పీన్స్)పై, ఆండ్రీవ 63, 63తో మయర్ షరీఫపై, కసట్‌కినా (ఆస్ట్రేలియా) 75, 63 ఎమిలియానా (కొలంబియా)పై, అలెగ్జాండ్రోవా 62, 75తో ప్రిసిల్లాపై, సంసనోవా 63, 62తో జాయింట్‌పై, నవారో 63, 61తో క్విటోవా (చెక్)పై గెలిచారు. సినర్ అలవోకగా..: పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సినర్ 64, 63, 60తో లూకా నార్డీని, ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 67(6), 67(8), 64, 76(6), 64తో పెరికార్డ్‌ను, మినార్ 62, 62, 76(2)తో రాబర్డో (స్పెయిన్)ను ఓడిరచారు. అయితే, మూడో సీడ్ జ్వెరెవ్ 67(3), 76(8), 36, 76(5), 46తో ఆర్థర్ రెండర్‌కెంచ్ (ఫ్రాన్స్) చేతిలో, ముసెట్టి (ఇటలీ) 26, 64, 57, 16తో నికోలజ్ బాసిల్లాషవిలి (జార్జియా) చేతిలో పరాజయం పాలయ్యారు.





# దక్షిణాఫ్రికా ఘనవిజయం

దక్షిణాఫ్రికా ఖాతాలో మరో ఘనవిజయం చేరింది. బ్యాటింగ్‌లో శతకం బాదిన కార్బిన్ బాష్ బౌలింగ్‌లోనూ చెలరేగి ఐదు వికెట్లతో రాణించాడు. దీంతో జింబాబ్వేతో నాలుగు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్టులో సఫారీలు 328 పరుగుల తేడాతో గెలుపొందారు. 537 పరుగుల భారీ లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 208 పరుగులకే కుప్పకూలింది. అంతకుముందు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 418/9 డిక్లేర్, రెండో ఇన్నింగ్స్‌లో 369 పరుగులు చేయగా.. జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 251 పరుగులకు పరిమితమైంది.

# భారత పేసర్ మహ్మద్ షమీకి షాక్

భరణంగా ప్రతినెల 4 లక్షలు చెల్లించాలని హైకోర్టు ఆదేశం..!

భారత పేసర్ మహ్మద్ షమీకి షాక్ తగిలింది. గృహహింస కేసు ఎదుర్కొంటున్న స్పీడ్‌స్టర్‌ను భరణం చెల్లించాల్సిందిగా హైకోర్టు ఆదేశించింది. కొన్నేళ్లుగా దూరంగా ఉంటున్న భార్య హసిన్ జహన్, కూతురు ఐరా ఖర్చుల కోసం ప్రతి నెల రూ.4 లక్షలు ఇవ్వాలని మంగళవారం కోల్‌కతా హైకోర్టు తెలిపింది. ఇరువురి వాదనలు విన్న జస్టిస్ అజయ్ కుమార్ ముఖర్జీ భరణం కింద భార్యకు రూ.1.5లక్షలు, కూతురుకు రూ.2.5 లక్షలు ఇవ్వాల్సిందేనని షమీకి స్పష్టం చేసింది. మోడల్ అయిన హసిన్ జహన్‌ను షమీ 2014లో పెండ్లి చేసుకున్నాడు. మరుసటి ఏడాది ఈ జంటకు అమైరా జన్మించింది. అయితే.. 2018లో షమీపై గృహ హింస కేసు పెట్టిన జహన్.. ఆ తర్వాత విడాకులకు దరఖాస్తు చేసింది. అప్పటి నుంచి ఇద్దరూ విడిగా ఉంటున్నారు. ప్రస్తుతానికి అమైరా తల్లి హసిన్ వద్దనే ఉంటోంది. దాంతో, ఆమెను కలిసేందుకు షమీ ఎంత ప్రయత్నించినా జహన్ అడ్డుపడుతోంది. అదే ఏడాదిలో అలిపోర్ కోర్టులో జహన్ తనకు షమీ నుంచి రూ.10 లక్షణ భరణం ఇప్పించాలని డిమాండ్ చేసింది. కానీ, కోర్టు మాత్రం ప్రతి నెల ఆమె ఖర్చులకు రూ.50 వేలు, కూతురుకు రూ.80 వేలు మాత్రమే చెల్లించాలని చెప్పింది. దాంతో, జహన్ ఆ తీర్పును సవాల్ చేస్తూ కోల్‌కతాలోని ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అర్జున అవార్డు : రెండేళ్ల క్రితం స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచ కప్‌లో షమీ అద్భుతంగా రాణించాడు. మొత్తంగా 24 వికెట్లు తీసి టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. టైటిల్ పోరులోనూ షమీ మూడు వికెట్లు తీసినా.. ట్రావిస్ హెడ్ సూపర్ సెంచరీతో ఆసీస్‌ను గెలిపించాడు. దాంతో, కంగారూ జట్టు రికార్డు స్థాయిలో ఆరోసారి చాంపియన్‌గా అవతరించింది. నిరుడు అత్యుత్తమంగా రాణించిన షమీ ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు అందుకున్నాడు. రాష్ట్రపతి భవన్‌లో ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు స్వీకరించాడు.



# కొత్త జాతీయ స్పోర్ట్స్ పాలసీకి కేంద్ర మంత్రిమండలి ఆమోదం



కొత్త జాతీయ స్పోర్ట్స్ పాలసీకి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో నూతన క్రీడా పాలసీకి 'ఖేలో భారత్ నీతి' అని నామకరణం చేశారు. 2047 నాటికి ప్రపంచంలో టాప్5 క్రీడా దేశాల్లో భారత్ ఒకటిగా నిలబడాలనే లక్ష్యంతో ఈ పాలసీని రూపొందించినట్టు ప్రధాని మోదీ తెలిపారు. కొత్త పాలసీలో ఐదు ప్రధాన అంశాలను పొందుపరిచారు. ప్రపంచ వేదికలపై సత్తా చాటడం, ఆర్థిక అభివృద్ధిలో క్రీడారంగం భాగస్వామ్యం, సామాజిక అభివృద్ధిలో క్రీడల పాత్ర, ప్రజా ఉద్యమంగా క్రీడలు, జాతీయ విద్యా విధానంలో క్రీడలకు చోటు అనే ఐదు అంశాలకు కొత్త పాలసీలో ప్రాధాన్యత ఇచ్చారు. ఒలింపిక్స్ సహా అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించడం, క్రీడా సంబంధిత పర్యాటకం, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక అభివృద్ధికి దోహదం, ఆదివాసీ, వెనుకబడిన వర్గాలు, మహిళలను క్రీడారంగంలో రాణించేందుకు ప్రోత్సహించడం, జాతీయ విద్యా విధానంలో క్రీడలను తప్పనిసరి అధ్యాయంగా చేర్చడం, ఇవన్నీ అమలయ్యేందుకు ప్రత్యేక పరిపాలన వ్యవస్థను రూపొందించాలనే అంశాలకు పాలసీలో ప్రాముఖ్యత ఇచ్చారు. 1984లో తొలిసారి...: స్పోర్ట్స్ పాలసీ 1984లో తొలిసారి అమల్లోకి రాగా 2001లో చివరిసారిగా ఆధునీకరించారు. 2014 తర్వాత బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఖేలో ఇండియా, టాప్స్ వంటి పథకాలను ప్రవేశపెట్టారు. 2028లో జరిగే తదుపరి ఒలింపిక్స్‌లో భారత పతకాల సంఖ్య రెండు అంకెలకు చేరాలని కేంద్ర క్రీడాశాఖ లక్ష్యంగా పె ట్టుకుంది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం కూడా భారత్ ప్రయత్నాలు చేస్తోంది. అహ్మదాబాద్‌లో ఒలింపిక్స్..: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష బృందం లాసన్నేలోని అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) ప్రధాన కార్యాలయానికి మంగళవారం వెళ్లింది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యాయినికి ఇప్పటికే సన్నద్ధత లేఖను ఇచ్చిన ఐఓఏ, భారత్‌లో విశ్వక్రీడల నిర్వహణకు ఉన్న వనరుల గురించి ఐఓసీ ప్రతినిధులకు ఉష బృందం వివరించింది. అహ్మదాబాద్ వేదికగా ఒలింపిక్స్ నిర్వహణ ప్రతిపాదనల గురించి చర్చించారు. ఉష బృందంలో కేంద్ర, గుజరాత్ క్రీడా శాఖ అధికారులు, ఐఓఏ ప్రతినిధులు ఉన్నారు.




# ఐసీసీ ర్యాంకులలో మంధానవి3

టీమ్‌ఇండియా మహిళా క్రికెట్ జట్టు ఓపెనర్ స్మృతి మంధాన ఐసీసీ ర్యాంకులలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నది. ఇప్పటికే ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న మంధాన.. తాజాగా టీ20 ర్యాంకులలోనూ టాప్3కు దూసుకొచ్చింది. ఇంగ్లండ్‌తో ముగిసిన తొలి టీ20లో శతకం బాదిన మంధాన.. ఒకస్థానాన్ని మెరుగుపరుచుకుని మూడో స్థానానికి ఎగబాకింది. ఆసీస్ బ్యాటర్ బెత్ మూనీ 794 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన కొనసాగుతుండగా విండీస్ అమ్మాయి హీలీ మాథ్యూస్ (774) రెండో స్థానంలో ఉంది. మంధాన 771 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది.

# ఆర్‌సీబీ యాజమాన్యమే కారణం...

ఐపీఎల్‌లో తొలి ట్రోఫీ గెలిచిన ఆనందంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా విజయోత్సవ వేడుకలకు పిలుపునిచ్చిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) యాజమాన్యమే చిన్నస్వామి తొక్కిసలాట ఘటనకు కారణమని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యూనల్ (క్యాట్) అభిప్రాయపడిరది. జూన్ 4న చిన్నస్వామి స్టేడియం ఆవల జరిగిన దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దీనిపై క్యాట్ స్పందిస్తూ.. 'ప్రాథమికంగా చూస్తే ఇంత భారీ స్థాయిలో అభిమానులు తరలిరావడానికి ఆర్‌సీబీ యాజమాన్యమే కారణం. ఆ జట్టు సోషల్ మీడియా ఖాతాలో విక్టరీ పరేడ్ పోస్ట్ పెట్టిన 12 గంటల్లోపే అభిమానులు చిన్నస్వామికి పోటెత్తారు. ఆర్‌సీబీ ముందుగా పోలీసుల నుంచి పరేడ్‌కు అవసరమైన అనుమతులు తీసుకోలేదు. 35 వేల సామర్థ్యం గల స్టేడియానికి సుమారు 2 నుంచి 3 లక్షల మంది దాకా తరలిరావడంతో పోలీసులు వారిని అదుపుచేయలేకపోయారు. సమయాభావం వల్ల పోలీసులు సైతం అవసరమైన బలగాలను సమకూర్చుకోలేకపోయారు. పోలీసులేమీ దేవుళ్లు కాదు కదా.. వాళ్లూ మానవ మాత్రులే. భారీగా వచ్చిన జనాలను అదుపుచేయడానికి వారి దగ్గర అల్లావుద్దీన్ దీపం వంటిదేమీ లేదు. పోలీసులు పూర్తి సన్నద్ధం అయ్యేందుకు సమయం ఇచ్చుంటే బాగుండేది' అని వెల్లడిరచింది. దీనిపై ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ ఇంకా స్పందించలేదు.



# ముగిసిన ఎలైట్ బాక్సింగ్ టోర్నీ

సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నాలుగు రోజులుగా జరిగిన మహిళల ఎలైట్ బాక్సింగ్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. టోర్నీ ఆఖరి రోజైన మంగళవారం ఫైనల్ పోటీలలో రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్ (ఆర్‌పీఎస్‌బీ) బాక్సర్లు సత్తా చాటారు. టోర్నీలో ఆర్‌పీఎస్‌బీ.. మూడేసి స్వర్ణాలు, రజతాలు, కాంస్యాలతో మొత్తంగా 9 పతకాలు సాధించి టీమ్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది. స్వర్ణం ఖాయమనుకున్న తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ రజతంతో సరిపెట్టుకుంది. 51 కిలోల విభాగంలో ఫైనల్ బరిలో నిలిచిన నిఖత్.. గాయం కారణంగా పోటీనుంచి తప్పుకోవడంతో ఆర్‌పీఎస్‌బీ బాక్సర్ జ్యోతి స్వర్ణం గెలుచుకుంది. రైల్వేస్ నుంచి 48 కిలోల విభాగంలో నీతూ, 60 కిలోల కేటగిరీలో ప్రాచీ సైతం పసిడి పతకాలతో మెరిశారు. తెలంగాణ బాక్సర్లు నిహారిక గొనెళ్ల (60 కి.), యశీ శర్మ (65 కి.) కాంస్యాలు సాధించారు. భారత స్టార్ బాక్సర్ లవ్లీనా బోర్గొహెయిన్ (75 కి.) పసిడి గెలిచింది.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in